# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 10

ఆదివారం, 1 సెప్టెంబర్, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## ఆరుగురు అధికారులపై కేసులు







**ఈర్లచెరువు, ఎర్రకుంటల్లో నిర్మాణాలకు అనుమతులిచ్చినందుకే..**

**హైడ్రా కమిషనర్ ఫిర్యాదు మేరకు నమోదు.. ఇద్దరు భవన నిర్మాణదారులపైనా చర్యలు**

**హైదరాబాద్:** చెరువుల బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలకు అనుమతులిచ్చిన ఆరుగురు అధికారులపై సైబరాబాద్ ఈవోడబ్ల్యూ(ఆర్థిక నేరాల విభాగం) పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. ఎర్రకుంట చెరువులో అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిన నిజాంపేట మున్సిపల్ కమిషనర్ పి.రామకృష్ణారావు, బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్, మేడ్చల్- మల్కాజిగిరి ల్యాండ్ - 2లో

# మేఘం బద్దలైంది..

## రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షం

**నీట మునిగిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలు**

**ఉప్పొంగిన వాగులు... దిగ్బంధంలో పల్లెలు**

**వర్షాలకు ముగ్గురి మృతి.. వాగులో ఒకరి గల్లంతు**

**ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో 21.2 సెం.మీ..**

**నారాయణపేట జిల్లా మరికల్‌లో 13.8 సెం.మీ**

**కోదాడలో వరద బీభత్సం.. విద్యుత్తు నిలిపివేత**

**హైదరాబాద్-విజయవాడ రోడ్డుపై ట్రాఫిక్ జాం**

**నేడు, రేపు వర్షాలే.. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్**

**హైదరాబాద్‌లో సోమవారం బడులకు సెలవు**

*తెలంగాణపై మబ్బు దుప్పటి కమ్ముకుంది. శనివారం పొద్దున మొదలైన వర్షం రాత్రి అయినా ఆగలేదు! బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో కొన్నిచోట్ల జల్లులుగా.. ఇంకొన్ని చోట్ల భారీగా.. మరికొన్ని చోట్ల అతిభారీగా వర్షం పడింది! రాజధాని హైదరాబాద్ సహా పలుచోట్ల జనజీవనం స్తంభించింది. పట్టణాలు, నగరాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు జలమయమై ఇళ్లలోకి వరద పోటెత్తింది. పల్లెల్లో వరి పొలాలు, పత్తి, మొక్కజొన్న, కంది చేలు నీటమునిగాయి. రైతులు, వ్యవసాయ కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇప్పటికే నిండిన చెరువులు, కుంటలు అలుగు పోస్తుంటే.. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా చాలాచోట్ల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతికి రోడ్లు దెబ్బతిన్నాయి. అక్కడక్కడా పాత ఇళ్లు కూలిపోయాయి. వర్షాల కారణంగా జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఒకరు గాయపడ్డారు. మరొకరు వరద నీటిలో గల్లంతయ్యారు! ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో 21.2 సెం.మీ వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా మరికల్‌లో 13.8 సెం.మీ, యాదాద్రి జిల్లా అడ్డగూడూరులో 10.3 సెం.మీ, వరంగల్ జిల్లా దుగ్గొండిలో 9.48 సెం.మీ, కొత్తగూడెం జిల్లా చండ్రుగొండలో 9.37 సెం.మీ, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో 8.5 సెం.మీ, ఆసిఫాబాద్ జిల్లా రెబ్బనలో 7.8 సెం.మీ, వికారాబాద్ జిల్లా చౌదాపూర్‌లో 7 సెం.మీ వర్షపాతం నమోదైంది. సింగరేణిలో భారీ స్థాయిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. హైదరాబాద్‌లో రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో ట్రాఫిక్ జాం నెలకొంది. వర్షాల కారణంగా హైదరాబాద్ పరిధిలోని విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు. ఇతర జిల్లాల్లో పరిస్థితులను బట్టి డీఈవోలు సెలవు ప్రకటించవచ్చునని ఆదేశాలు వెళ్లాయి.*





- సోనియా సూచన మేరకు తుది నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం
- ఆయన నియామక పత్రంపై ఏఐసీసీ చీఫ్ ఖర్గే సంతకం చేశారన్న పార్టీ వర్గాలు.. ఏ క్షణమైనా ఏఐసీసీ అధికారిక ప్రకటన

## టీపీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్‌గౌడ్!

**న్యూఢిల్లీ:** తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త సారథిగా ప్రస్తుత పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను నియమిస్తూ ఏఐసీసీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. తెలంగాణ సారథితోపాటు పశ్చిమ బెంగాల్‌కు ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, కేరళకు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామకానికి ఆమోదం తెలుపుతూ సంబంధిత పత్రంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే - 2వ పేజీలో

## హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించండి

**బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్**



**హైదరాబాద్:** రాష్ట్రంలో పాలన గాడితప్పి ప్రజారోగ్యం పడకేసి తెలంగాణ మొత్తం విషజ్వరాల బారిన పడనందున.. వెంటనే ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను తెరపైకి తెచ్చిందని, కానీ దీనిద్వారా అసలైన సమస్యలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో చెరువులను పరిరక్షించాల్సిందేనని, కానీ ఈ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని డిమాండ్ చేశారు. కబ్జాల వివరాలు బయటపెట్టాలని, ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందన్నారు. దేవాదాయ భూములు, అసైన్డ్ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు అన్ని అనుమతులు తీసుకుని కట్టుకున్నాక.. - 2వ పేజీలో

**ఎంఐఎం ఆనవాళ్లు లేకుండా చేస్తాం**

**పాతబస్తీని కైవసం చేసుకోవడమే బీజేపీ లక్ష్యం**

**మోసాల్లో కేసీఆర్‌ను మించిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

## మా టార్గెట్ పాతబస్తీ..



**నయీంనగర్ (హనుమకొండ):** 'మా టార్గెట్ పాతబస్తీ. ఓల్డ్ సిటీని న్యూ సిటీగా మార్చాలని పోరాడుతున్నాం... ఎంఐఎం ఆనవాళ్లు లేకుండా చేస్తాం. పాతబస్తీని కైవసం చేసుకోవడమే బీజేపీ లక్ష్యం'అని కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. సంఘ విద్రోహులకు అడ్డాగా మారిన పాతబస్తీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామనే విషయాన్ని మైనారిటీ మోర్చా నాయకులంతా ముస్లింలకు వివరించాలని సూచించారు. హనుమకొండలో శనివారం జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధాలు, మోసాలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ కేసీఆర్‌ను మించిపోయిందన్నారు. 'వెయ్యి ఎకరాల్లో - 2వ పేజీలో

## సాగర్ చుట్టూ స్కైవాక్ వే



**ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి: సీఎం రేవంత్**

**హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారి 4 వరుసలుగా విస్తరణ**

**రాష్ట్రంలోని బౌద్ధ ఆధ్యాత్మిక ప్రాంతాలతో టూరిజం సర్క్యూట్**

**నాగార్జునసాగర్ బుద్ధవనంలో అంతర్జాతీయ స్థాయి మ్యూజియం**

**గోల్కొండ చుట్టూ ఉన్న రహదారుల విస్తరణకు నిర్ణయం**

**హైదరాబాద్ నడిబొడ్డున హుస్సేన్‌సాగర్ చుట్టూ టూరిజం డెస్టినేషన్‌సర్కిల్‌గా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. అక్కడ స్కైవాక్ వే నిర్మించాలని.. ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.**

**హైదరాబాద్:** రాష్ట్రంలో కొత్త పర్యాటక విధానం తీసుకొస్తున్న నేపథ్యంలో ఫణిగిరి, నేలకొండపల్లి, నాగార్జునసాగర్ బౌద్ధ క్షేత్రాలతోపాటు హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధ విగ్రహాన్ని కలిపి ఒక పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సంకల్పించినట్లు సీఎం రేవంత్ తెలిపారు. బౌద్ధులను ఆకట్టుకునేలా నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లోని బుద్ధవనంలో అంతర్జాతీయ స్థాయి మ్యూజియం ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

**పర్యాటక కేంద్రంగా బుద్ధవనం..:** కేంద్రం ప్రకటించిన స్వదేశీ దర్శన్ 2.0 పథకంలో భాగంగా బుద్ధవనం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే కేంద్రానికి డీపీఆర్‌ను సమర్పించింది. రూ. 25 కోట్ల అంచనాలతో బుద్ధవనంలో బుద్ధిస్ట్ డిజిటల్ మ్యూజియం అండ్ ఎగ్జిబిషన్, డిజిటల్ ఆర్కైవ్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. వీటితోపాటు తాజాగా అంతర్జాతీయ బౌద్ధ మ్యూజియాన్ని ఈ ప్రణాళికలో చేర్చింది. అందులో భాగంగా నాగార్జునసాగర్ బుద్ధవనాన్ని - 2వ పేజీలో



## ఏ ముఖం పెట్టుకొని వస్తావ్?: భట్టి విక్రమార్క

**మీలాగా ఇళ్లల్లో పడుకోలేదు.. ప్రతి రోజూ ప్రజల్లో ఉంటున్నాం**

పెద్దపల్లి: రూ.లక్ష రుణమాఫీ చేస్తానని చెప్పి రైతులను మోసం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. ఇచ్చిన హామీ మేరకు నెలరోజుల్లోనే రూ.2లక్షల లోపు రుణాలను మాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించేందుకు ఇవాళ ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వస్తారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. 'డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేకపోయిన మీరు.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లు ఇవ్వాలని బడ్జెట్ కేటాయిస్తే.. మీ మాదిరిగా వాటిని ఎగ్గొట్టాలని చెప్పడానికి వస్తారా? జాబ్ కేలెండర్ ప్రకటించి ఉద్యోగాలు ఇస్తుంటే అవి తప్పు అని చెప్పడానికి వస్తారా? దళితులకు మూడు ఎకరాల భూ పంపిణీ అని చెప్పి ఇవ్వలేదని చెప్పడానికి వస్తారా? .. అని కేసీఆర్‌ను నిలదీశారు. 'నీవు, నీ కొడుకు పదేళ్లు తెలంగాణను దోచుకొని విదేశాల్లో దాచుకున్నారు' అని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి వాట్సప్ గ్రూప్‌ల ద్వారా తప్పుడు ప్రచారం చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

## అన్నం, పప్పులో పురుగులొస్తున్నా సీఎంకు పట్టదా?

**విద్యార్థినులు రోడ్డెక్కి ధర్నా చేసినా రేవంత్ స్పందించకపోవడం సిగ్గుచేటు**

**ఫెయిల్యూర్ సీఎంతోనే విద్యార్థులకు కష్టాలు: హరీశ్‌రావు**

**సబితారెడ్డితో కలిసి పాల్మాకుల కేజీబీవీ సందర్శన.. విద్యార్థినుల సమస్యలపై ఆరా**



**శంషాబాద్ రూరల్:** 'అన్నం, పప్పులో పురుగులు వస్తున్నాయని ఆడపిల్లలు రెండు కి.మీ. నడిచి జాతీయ రహ దారిపై ధర్నా చేస్తే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు స్పందనలేదు. విద్యా ర్థుల కన్నీళ్లు చూస్తుంటే ఏడుపొ స్తోంది. దీనికి సీఎంరేవంత్‌రెడ్డి సిగ్గుపడాలి. ఫెయిల్యూర్ సీఎం కారణంగా రాష్ట్రంలో గురుకులాలు, - 2వ పేజీలో

**విద్యార్థులు లేరనే సాకుతో సర్కారు కుట్ర**

**2.5 లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరం**

**టీచర్ల నియామకం సహా అన్నింటా విఫలం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం**

## 1864 స్కూళ్లను మూసేస్తారా?



**హైదరాబాద్:** పాఠశాల విద్యను నిర్లక్ష్యం చేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం చదువుకు దూరం చేస్తోందని భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు లేరనే సాకుతో ఈ ఏడాది 1,864 పాఠశాలలను మూసివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించకుండా మూసివేయాలని చూడటం సిగ్గుచేటు అని విమర్శించారు. విదేశీ పర్యటనలో ఉన్న కేటీఆర్ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాదితో పోలిస్తే 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య సుమారు - 2వ పేజీలో

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
ఆదివారం, 1 సెప్టెంబర్, 2024

# టీపీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్‌గౌడ్!

మొదటి పేజీ తరువాయి

సంతకం చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**రెండు నెలలుగా కసరత్తు..:** ముఖ్యంగా తెలంగాణకు సంబంధించి పీసీసీ అధ్యక్ష నియామకంపై గడిచిన రెండు నెలలుగా కసరత్తు జరుగుతుండగా, వివిధ సామాజిక కోణాల్లో అభ్యర్థుల ఎంపికపై చర్చలు జరిగాయి. పది రోజుల కిందటే మరో దఫాలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను ఢిల్లీకి పిలిపించి ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చర్చించారు. ఈ సందర్భంగా బీసీ సామాజికవర్గ నేతకే పీసీసీ పదవిని కట్టబెట్టాలనే తుది నిర్ణయానికి వచ్చారు. బీసీల్లో ప్రధాన పోటీదారులుగా ఉన్న మహేశ్‌గౌడ్‌తోపాటు పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌ల అభ్యర్థిత్వాలపై చర్చించారు. వారి అభ్యర్థిత్వాలపై రాష్ట్ర నేతల్లో భిన్నాభిప్రాయాలు ఉండటంతో నిర్ణయాధికారాన్ని అగ్రనేత సోనియా గాంధీకి కట్టబెట్టారు. ఆమె సూచనల మేరకు విద్యార్థి దశ నుంచి పార్టీకి సేవలందిస్తూ రాష్ట్ర నేతలందరితో సన్నిహిత సంబంధాలుగల మహేశ్ గౌడ్ వైపు ఏఐసీసీ మొగ్గుచూపినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికార ప్రకటన ఏ క్షణమైనా ఉంటుందని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి.

# హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించండి

మొదటి పేజీ తరువాయి

వాటిపై ప్రతాపం చూపొద్దన్నారు. ప్రజల్ని మభ్య పెట్టేం దుకు రేవంత్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. రుణమాఫీ చేయలేదు.. తులం బంగారం లేదు.. నిరుద్యోగ భృతి ఇవ్వ లేదని ఎద్దేవా చేశారు. ఉచితాలు, హామీలు, గ్యారంటీల పేరుతో ఎన్నికలకు ముందు హామీలిచ్చి.. గద్దెనెక్కాక ప్రజలను గోస పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు, అవినీతి, అప్పుల్లో కూరుకుపోయి దివాలా తీస్తున్నాయని తెలిపారు. రాహుల్ గాంధీ కటాకట్ కటాకట్ డబ్బులు వేస్తామని చెప్పారు.. ఇప్పుడు తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఫటాఫట్ దివాలా తీశాయని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. తెలంగాణనూ ఢిల్లీకి ఏటీఎంగా మార్చారని ఆరోపించారు. కోర్టులకు రాజకీయ రంగు పులమడం కాంగ్రెస్‌కే చెల్లిందన్నారు. వడ్డీతో సహా చెల్లిస్తామన్న.. ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని, అన్ని విషయాలకు కోర్టులు, న్యాయ వ్యవస్థ ఉన్నాయని ఒక ప్రశ్నకు సమాధానంగా లక్ష్మణ్ చెప్పారు. అధికారంలోకి రాకపోవడంతో బీఆర్ఎస్ నేతలకు పిచ్చి ముదిరిందని, ఇప్పటికే ఆ పార్టీ ఖేల్‌ఖతం.. దుకాణం బంద్ అయ్యిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కొత్తగా కలిసేది ఏముంది? వాళ్లు ఎప్పుడో కలిశారు కదా? అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై రాబోయే రోజుల్లో బీజేపీ ఉద్యమ బాట పడుతుందని, త్వరలోనే కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తుందని లక్ష్మణ్ వెల్లడించారు.

# మా టార్గెట్ పాతబస్తీ..

మొదటి పేజీ తరువాయి

జూ ఏర్పాటు చేస్తారట. మరో వెయ్యి ఎకరాల్లో హెల్త్ హబ్ ఏర్పాటు చేస్తారట. వేలాది ఎకరాల్లో ఫోర్త్ సిటీని నిర్మిస్తారట. అసలు ఉన్న భూములన్నీ కేసీఆర్ అమ్ముకున్నడు... మరి ఈ ప్రభుత్వం యాడ నుండి తీసుకొస్తది.?'అని ప్రశ్నిం చారు. బీఆర్ఎస్ పాలనలో బీజేపీ కార్యకర్తలపై చేసిన అరాచకాలను మర్చిపో లేమని, బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికే కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేసే వాళ్లమని చెప్పారు. రాక్షస పార్టీ బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని, ఇదంతా కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారమన్నారు. కాంగ్రెస్‌లోనే బీఆర్ ఎస్ విలీనం ఖాయమని, మాట ముచ్చట కూడా పూర్తయ్యిందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# 1864 స్కూళ్లను మూసేస్తారా?

మొదటి పేజీ తరువాయి

2.4 లక్షలు తగ్గడం ప్రమాదకర సంకేతమని పేర్కొన్నారు. ఎనిమిది నెలల్లోనే ప్రభుత్వ విద్యను కాంగ్రెస్ సర్కార్ అస్తవ్యస్తం చేసిందని, విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిందో సమీక్ష చేయకుండా ప్రభుత్వం నిద్రావస్థలో ఉందని నిందించారు. సీఎం రేవంత్‌రెడ్డికి విద్యా వ్యవస్థపై ఏమాత్రం పట్టింపు లేకపోవడం దారుణమని కేటీఆర్ విమర్శించారు.

**25వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 25 వేల ఉపాధ్యాయ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడం, స్కూళ్లల్లో మౌలిక వసతుల లేమి, నాణ్యమైన ఆహారం ఇవ్వకపోవడం, పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో అపరిశుభ్రత, భద్రత లేకపోవడం.. వెరసి ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు భయపడే పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు.

# అన్నం, పప్పులో పురుగులొస్తున్నా సీఎంకు పట్టదా?

మొదటి పేజీ తరువాయి

మైనారిటీ విద్యా వ్యవస్థ కుంటుపడింది' అని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని పాల్మాకు లలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మాజీ మంత్రి పి.సబితారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. హరీశ్, సబిత రాకతో పిల్లలు వారి బాధలు చెప్పుకొని ఏడ్చారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడారు.

**కడుపు నిండా భోజనం పెట్టట్లేదు..:** 'విద్యార్థినులకు కడుపు నిండా భోజ నం లేదు. పుస్తకాలు, బోధన, కనీస సౌకర్యా లు లేవని విద్యార్థినులు బాధ పడుతున్నారు. ఆరో తరగతి వారికి ఒక జత యూనిఫాం మాత్రమే వచ్చినట్లు విద్యార్థినులు చెబుతున్నారు. ఇప్పటికీ పూర్తి స్థాయిలో పుస్తకాలు ఇవ్వలేదు. సమస్య ల గురించి చెబితే వారిపట్ల ఉపాధ్యా యులు వ్యవహరించిన తీరు బాధాకరం. గతంలో కేసీఆర్ సన్న బియ్యంతో అన్నం పెడితే ప్రస్తుతం గొడ్డు కారంతో భోజనం పెడుతున్నారు. మెనూ ప్రకా రం పిల్లలకు గుడ్లు, మాంసం పెట్టట్లేదు. సీఎం వద్ద విద్య, సాంఘిక సంక్షేమ శాఖ లున్నా సమీక్షల్లేక అంతా అస్తవ్యస్తంగా మారింది. ఈ ప్రభు త్వం వచ్చాక కస్తూ ర్బా, గురుకులాలు, ఎస్సీ, ఎస్టీ, మైనా రిటీ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తున్నారు' అని హరీశ్‌రావు విమర్శించారు.

**ప్రభుత్వానిది మొద్దునిద్ర..:** సంక్షేమ పాఠశాలల్లో విషాహారం తిని 500 మంది పిల్లలు ఆస్పత్రులపాలైతే 38 మంది పిల్లలు చనిపోయారని హరీశ్‌రావు ఆరోపించారు. ఓవైపు ఎలుకలు, మరోవైపు పాముకాట్లకు పిల్లలు గురవుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో గురుకులాలు దేశానికి ఆదర్శంగా ఉండేవన్నారు. ముఖ్యమంత్రి మాటలు కాకుండా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పాల్మాకులలో ఉపాధ్యాయులందరినీ బదిలీ చేసి పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

### విద్యావ్యవస్థను గాలికొదిలేశారు: సబితారెడ్డి

విద్యావ్యవస్థను ప్రభుత్వం గాలికొదిలేసిందని మాజీ మంత్రి పి.సబితారెడ్డి ఆరోపించారు. ఎంత బాధ ఉంటే పిల్లలు రోడ్డు పైకి వస్తారో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. కలెక్టర్ ఇటువైపు చూసే తీరిక లేకుండా ఉన్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లో 800 వరకు పాఠశాలలు ఉపాధ్యా యుల్లేక మూతపడినట్లు వార్తలు వచ్చాయన్నారు. అంతకు ముందు మాజీ మంత్రులు పాఠశాలలోని వంటగది, తరగతి గదులను పరిశీలించారు. చక్రధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శిథిలమైన పాఠశాల భవనంలో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని కొడంగల్‌లోని దుద్యాల మండలం హస్నాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.





ఖమ్మం జిల్లా వైరా, మధిర మధ్య కిష్టాపురం వద్ద రహదారిపై పాలవాగు ఉద్ధృతి



సూర్యాపేట జిల్లా కోదాడలోని పురపాలక కార్యాలయంలో వరద చేరడంతో తడిసిన పత్రాలు





చెన్నై జాతీయ రహదారిపై విజయవాడ బెంజి సర్కిల్ పైవంతెన సమీపంలో జలమయం



నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలో పాతపల్లి వాగును ప్రమాదకరంగా దాటుతున్న విద్యార్థులు


# త్వరలోనే కొత్త ఆర్‌వోఆర్

**ఆర్‌వోఆర్‌పై ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ**

**అన్ని వర్గాల ప్రజలూ అభిప్రాయాలను వెల్లడించారు**

**జిల్లా స్థాయిల్లో వచ్చిన సూచనలను కలెక్టర్లు నివేదిస్తారు**

**కొత్త చట్టం అమలు: మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్:** రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)–2024 చట్టం ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ అభిప్రాయ సేకరణలో మేధావులు, రిటైర్డ్ రెవె న్యూ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, రైతుల నుంచి సామా న్యుల వరకు అందరూ తమ సల హాలు, సూచనలను ప్రభు త్వానికి ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ అభిప్రాయాలన్నింటినీ క్రోడీకరించి కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని అందుబా టులోకి తెస్తామని, ఇందుకు అవసరమైన కసరత్తును త్వరి తగతిన పూర్తి చేస్తామని శనివారం ఒక ప్రకటనలో ఆయన వివరించారు. రాష్ట్రంలో భూమి సమస్యలకు శాశ్వత పరి ష్కారమే లక్ష్యంగా, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని, తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షకు అనుగుణంగా కొత్త చట్టాన్ని తెస్తామని స్పష్టం చేశారు. "తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక భూ సమస్యలు పరిష్కారమవుతాయని అనుకుంటే గత పాలకుల తొందరపాటు నిర్ణయాలతో కొత్త సమస్యలు ఉత్పన్న మయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ఆర్‌వోఆర్ చట్టం లోపభూయిష్టంగా ఉండడంతో రైతులు, భూముల యజమానులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. తప్పుల తడకగా సేకరించిన వివరాలతో నిర్వహించిన ధరణి పోర్టల్‌కు 30 లక్షల మంది రైతులు బాధితులుగా మారారు. అటువంటి పరిస్థితులను పునరావృతం కానివ్వం. తాము రూపొందించిన ఆర్‌వోఆర్ ముసాయిదా చట్టంపై విస్తృత స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపాం. జిల్లా స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహించాం.

# ఉత్తమ్ నోటిని ప్రక్షాళన చేయాలి

**బూతులు మాట్లాడటంలో రేవంత్‌తో ఉత్తమ్ పోటీ: మాజీ మంత్రి హరీశ్‌రావు**

**హైదరాబాద్:** బూతులు మాట్లాడటంలో ముఖ్య మంత్రి రేవంత్‌తో పోటీ పడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నోటిని ప్రక్షాళన చేయాలని బీ ఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తమ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ను ఉద్దేశించి.. 'డెకాయిట్'అని మంత్రి ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'బూతులు మాట్లా డటం, అన్‌పార్లమెంటరీ భాషను ఉపయోగించడం లో రేవంత్ కంటే తాను వెనుకబడిలేనని ఉత్తమ్ నిరూ పించాలనుకుంటున్నారు. పేరు ఉత్తమ్ కానీ మాట తీరు మూసీ ప్రవాహం. గత కాంగ్రెస్ పాలనలో జలయజ్ఞం పేరిట ఈపీసీ కాంట్రాక్టు విధానం, మొబిలైజేషన్ అడ్వాన్సుల రూపంలో రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారు.

# సాగర్ చుట్టూ స్కైవాక్ వే

మొదటి పేజీ తరువాయి

పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతారు. నాగార్జున సాగర్ డ్యామ్‌అందాలతో పాటు పరిసరాల్లోని బుద్ధవనాన్ని అంతర్జాతీయ బౌద్ధక్షేత్రంగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. నాగార్జునసాగర్‌సం దర్శనకు వెళ్లే పర్యాటకులు బ్యాక్ వాటర్ వరకు బోట్‌లో విహరించే సదుపాయాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు అను వైన టూరిజం ప్యాకేజీలు రూపొందించాలని సీఎం అధికారు లను ఆదేశించారు. ఇక హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆర్ అండ్ బీ అధికారులను సీఎం ఆదేశించారు. తద్వారా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పర్యాటకు లు వెళ్లి రావడానికి వీలుంటుందని అభిప్రాయపడ్డారు.

### గోల్కొండ చుట్టూ రహదారుల విస్తరణ...

గోల్కొండ కోట చుట్టూ ఉన్న రహదారులు ఇరుకుగా ఉన్నాయని, వాటిని విశాలంగా అభివృద్ధి చేయాలని సీఎం నిర్ణయించారు. ఆక్రమణలుంటే తొలగించాలని, అక్కడున్న ఇళ్ల వాసులు, దుకాణదారులు నిరాశ్రయులు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వారికి మరో చోట పునరావాసం కల్పించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**వలయాకారంలో డిజైన్:** హుస్సేన్‌సాగర్ చుట్టూ ట్యాంక్ బండ్, తెలంగాణ అమరుల జ్యోతి, నెక్లెస్‌రోడ్డు, సంజీవయ్య పార్కు వరకు వలయాకారంలో స్కైవాక్ వే డిజైన్ సిద్ధం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. ఈ ప్రాంతాన్ని భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక హబ్‌గా రూపొందించాలని ఆదేశించారు. అనుభవమున్న కన్సల్టెన్సీలు, నిపుణులతో అంతర్జాతీయ స్థాయి నమూనాలను తయారు చేయించాలన్నారు. పర్యాటకులు ఆహ్లాదంగా గడిపేలా ఫుడ్‌కోర్టులు, వివిధ స్టాళ్లను ఏర్పాటు చేయాలని.. ఈ ప్రాంతాన్ని సిటీలో సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

# ఆరుగురు అధికారులపై కేసులు

మొదటి పేజీ తరువాయి

అండ్ సర్వే రికార్డ్స్ సహాయ డైరెక్టర్ కె.శ్రీనివాసులు, హెచ్‌ఎండీఏ సహాయ ప్రణాళిక అధికారి సుధీర్‌కుమార్‌పై ఓ కేసుబీ ఈర్ల చెరువులో అక్రమ నిర్మాణాలకు అనుమతిచ్చినందుకు చందానగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సుధాంశు, జీహెచ్‌ఎంసీ సహాయ పట్టణ ప్రణాళిక అధికారి ఎం.రాజ్‌కుమార్ తదితరులపై మరో కేసు నమోదైంది. హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి ఈ కేసులు నమోదు చేశారు. ఈర్లచెరువు బఫర్ జోన్‌లో భవనాలు నిర్మించిన ఇద్దరు నిర్మాణదారులపై కేసు నమోదైంది. ఫిర్యాదుల్లో పేర్కొన్న ప్రకారం వివరాలిలా..

### బఫర్ జోన్‌లో మూడు భవనాలు

చందానగర్ సర్కిల్ మదీనాగూడ గ్రామంలోని ఈర్ల చెరువు బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలకు 2023 మే 4 నుంచి 2024 జులై 23 మధ్య చందానగర్ సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేసిన ఎం.రాజ్‌కుమార్, 2020 ఫిబ్రవరి 20 నుంచి 2023 జులై 18 వరకు చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన ఎన్.సుధాంశు అనుమతులు ఇచ్చారు. బఫర్ జోన్‌లోని సర్వే నంబరు 25లో 148, 149, 150 ప్లాట్ నంబర్లతో 223.24 చదరపు మీటర్ల చొప్పున విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల భవనాలు మూడు నిర్మించారు. దుర్భాకుల కృష్ణకిశోర్, డి.స్వర్ణలత యజమానులుగా ఉన్న మూడు భవనాలకు 2023 జూన్ 21న జీహెచ్‌ఎంసీ చందానగర్ సర్కిల్ నుంచి అనుమతి లభించింది. ఈ అక్రమ నిర్మాణాలను ఆపేయాలని నీటిపారుదల శాఖ పదేపదే అభ్యర్థించినా.. హెచ్చరించినా వారు పట్టించు కోలేదు. అవి అక్రమ నిర్మాణాలని జీహెచ్‌ఎంసీ నార్త్‌ట్యాంక్ డివిజన్ ఎస్‌ఈ బృందం తేల్చింది. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు ఈ ఏడాది జనవరి, మార్చిలలో చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు నీటిపారుదల శాఖ లేఖలు రాసింది. అయినప్పటికీ 2024 మార్చి 22న అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సైతం ఇచ్చారు. మూడు అంతస్తుల్లో భవనాల నిర్మాణానికి అనుమతివ్వగా నాలుగు అంతస్తులు నిర్మించారు. దీనిపై ప్లాట్ నంబర్లు 149, 150లలో నిర్మిం చిన భవనాలకు చందానగర్ డిప్యూటీ కమిషనర్ ఈ ఏడాది మే 23న షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బిల్డర్ స్పందిం చకపోవడంతో మళ్లీ తాఖీదులిచ్చారు. 15 రోజులైనా స్పం దన లేకపోవడంతో భవనాలను కూల్చేందుకు జీహెచ్‌ఎంసీ యత్నించింది. ఆ తర్వాత అనుమతుల్ని రద్దు చేసేందుకు జీహెచ్‌ఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు నోట్‌ఫైల్ చేసినా ఇప్పటికీ పూర్తి కాలేదు. చెరువులపై జులై 20న నిర్వహించిన సమీక్షలో ఈర్ల చెరువుపై నీటిపారుదల శాఖ లేవనెత్తిన అభ్యంతరాల మేరకు 22న హైడ్రా పరిశీలించింది. ఉల్లంఘనులతో అధికారులు కుమ్మక్కైనట్లు గుర్తించింది. అక్రమ కట్టడాలను ఆగస్టు 10, 11 తేదీల్లో కూల్చేసింది.

### ఈర్లచెరువు బఫర్‌జోన్‌లో భవనాలు నిర్మించిన ఇద్దరిపై..

మదీనగూడలోని ఈర్లచెరువు బఫర్ జోన్‌లో భవనాలు నిర్మించిన ఇద్దరిపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నీటిపారుదల శాఖ నార్త్‌ట్యాంక్ డివిజన్ ఏఈఈ వి.గంగాపావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగస్టు 18న కేసు నమోదు చేయగా.. శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసు ఎఫ్ఐఆర్‌లోని వివరాల ప్రకారం.. ఈర్లచెరువు బఫర్‌జోన్‌లోని సర్వే నంబరు 25లో మూడు భవనాలు నిర్మించారు. ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమంటూ డి స్వర్ణలత, డి.కిశోర్‌లపై కేసు నమోదైంది.

### తప్పుడు సర్వే నంబర్లు వేసి..

నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్‌లో 3.033 ఎకరాల విస్తీర్ణంలో ఎర్రకుంట ఉంది. నిజాంపేట మున్సిపల్ కమిషనర్ అనుమతి ఇవ్వడంతో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మూడు భవనాలు నిర్మించారు. తప్పుడు సర్వే నంబర్లు వేయడంలో ఆక్రమణదారులకు బాచుపల్లి తహసీల్దార్ సహకరించినట్లు తేలింది. దీనిపై చర్యలు తీసుకునే బదులు.. భవన నిర్మాణానికి నిజాంపేట మున్సిపల్ కమిషనర్ అనుమతులు ఇచ్చారు. సహాయ ప్రణాళిక అధికారి గుడ్డిగా అనుమతి ఇచ్చారు. హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు తెచ్చుకుని ఎర్రకుంట ఎఫ్‌టీఎల్‌లో మూడు భవనాలను అక్రమంగా నిర్మించారంటూ ఆకుల సతీశ్ ఆగస్టు 6న ఫిర్యాదు ఇచ్చారు. ఎఫ్‌టీఎల్‌లోని అక్రమ నిర్మాణాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని అంతకుముందు నీటిపారుదల శాఖ హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు లేఖ రాసింది. ఆగస్టు 14న హైడ్రా కమిషనర్, నీటిపారుదల శాఖ ఈఈ, నిజాంపేట మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక అధికారుల సంయుక్త బృందం ఎర్రకుంటను సందర్శించినప్పుడు అక్రమంగా అనుమతులు పొందినట్లు గుర్తించింది. చెరువుకు 75 మీటర్ల దూరంలో భవనాలు ఉన్నట్లు తప్పుడు జియో కోఆర్డినేట్స్ చూపించి అనుమతులు ఇచ్చారని తేలింది. హైడ్రా విచారించే సమయంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అదనపు సంచాలకులు సరైన ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో పాటు.. జియో కోఆర్డినేట్స్‌ను మార్చినట్లు తేలింది. మున్సిపల్ కమిషనర్ పి.రామకృష్ణారావు, బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ సహాయ డైరెక్టర్ కె.శ్రీనివాసులు, హెచ్‌ఎండీఏ సహాయ ప్రణాళిక అధికారి సుధీర్‌కుమార్‌ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఫిర్యాదులో హైడ్రా పేర్కొంది. ఆగస్టు 15వ తేదీన కూల్చేసినట్లు తెలిపింది.

# ఫతేనగర్‌లో త్వరలో మురుగు నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం



కూకట్ పల్లి : ఆగష్టు 31(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో మురగునీటిని శుద్ధి చేయడం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం చేపట్టి పూర్తి చేసిందని, త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. డ్రైనేజీలలో మురికి నీళ్లు నిల్వ ఉండకుండా, చెరువుల్లో డ్రైనేజీ నీళ్లు కలవకుండా నూతన ఆలోచనలతో మాజీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఎస్.టి.పి. ప్లాంట్ కు శ్రీకారం చుట్టారని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్లతో 9 చెరువులపై ఏర్పాటు చేసిన ఎస్.టి.పి. పనులను శంకుస్థాపనకు సిద్ధంగా ఉన్న ఫతేనగర్ ఎస్.టి.పి పనులను పరిశీలించారు. ఫతేనగర్ డివి జన్ లాల్ బహదూర్ శాస్త్రి నగర్ లో నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న మురుగు నీటిశుద్ధి కేంద్రాన్ని కార్పొరేటర్ సతీశ్ గౌడ్ తో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా నీటి శుద్ధి పనులలో ఎలాంటి పనులు పెండింగ్ ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని మురుగు నీరు నాలాల ద్వారా ప్రమహిస్తున్న మురుగునీటిని శుద్ధి చేయడం, గ్రౌండ్ వాటర్ పొల్యూషన్ కాకుండా నిరో ధించడం కోసం రూ. 135 కోట్లతో బీఆర్ఎస్. గత ప్రభుత్వం ఎస్టీపీల నిర్మాణం చేపట్టినట్లు తెలి పారు. అతి త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి ఎస్టీపీ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎస్టీపీల నిర్మాణం ద్వారా మురుగు నీటి ఇబ్బందులు దూరమవుతాయ న్నారు. కార్యక్రమంలో జంట డివిజన్ల కార్పొరేటర్లు పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్రెడ్డి, కూతాడి రాములు, శంకర్ గౌడ్, ఉదయ్ కంచి బిక్షపతి, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## సంచార జాతుల జీవన విధానం మారేది ఎప్పుడు.

### ఈ జాతుల పట్ల దేశ పాలకులు నిర్లక్ష్యం

### సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఒంటెద్దు నరేందర్

సికింద్రాబాద్, ఆగస్టు 31 (వాయిస్ టుడే ప్రతినిధి): దేశానికి స్వాతంత్రం వచ్చి 76 ఏళ్ళు గడుస్తున్న సంచార జాతుల జీవన విధానం మారలేదని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఒంటెద్దు నరేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశ పాలకులు ఈ జాతి ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. సంచార జాతుల జీవన విధానం దినదినంగా దిగజారడం బాధాకరంగా ఉందన్నారు. సంచార జాతుల 72వ జాతీయ విముక్తి దినోత్సవం శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 15% ఉన్న సంచార జాతి ప్రజల సంక్షేమం కోసం రాజ్యాంగబద్ధమైన 10% రిజర్వేషన్లు కల్పించి విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. ఊరూరా తిరిగే సంచార జాతులను అభివృద్ధి చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన రాష్ట్ర అధ్యక్షులుగా తిపిరిశెట్టి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వెన్నెల నాగరాజ్, చెన్నయ్య, యువరాజ్, శ్యామల యాదగిరి, జాంగిర్ పాషా, వెంకటేష్, శ్రీనివాస్, బండారి లక్ష్మణ్, బాపన్న తదితరులు పాల్గొన్నారు.


## డి ఎన్ టి, ఎస్ ఎన్ టి సర్టిఫికెట్లు జారీ చేయాలి: ఎమ్మెస్ నరహరి



సికింద్రాబాద్, ఆగస్టు 31 (వాయిస్ టుడే ప్రతినిధి): సంచార ఎంబీసీ కులాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి డిఎన్టి, ఎస్ ఎన్ టి కులం సర్టిఫికెట్లు జారీ చేయాలని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల ఎంబీసీ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెస్ నరహరి డిమాండ్ చేశారు. ఈ కులాల కోసం సెపరేట్గా బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సంచార మూల నివాసి పోరాట జాతుల విముక్త దినోత్సవం సందర్భంగా శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంచార జాతుల సమస్యలు చాలా కిష్టతరంగా మారి బతుకులు దీనస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సంచార జాతుల కులాల అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ ను నియమించి నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సంచార జాతుల స్థితిగతులు పాలకులకు తెలిసిన అభివృద్ధి చేయడం మరిచారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి మంత్రులు స్పందించి సంచార జాతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## మయూరి నగర్ లో రోడ్ల నిర్మాణ తో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి

### కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్



శేరిలింగంపల్లిబీ ఆగష్టు 31(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలు చేపట్టవలసిన అభివృద్ధి పనులపై మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీ లో అసంపూర్తిగా మిగిలిన రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని, మంచి నీటి వసతిని మెరుగుపర్చాలని, మరియు డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం పనులు చేపట్టాలని కార్పొరేటర్ శ్రీకాంత్ కు దృష్టికి కాలనీ వాసులు దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మయూరి నగర్ కాలనీ వాసులు , అసోసియేషన్ సభ్యులు, మా దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సహకారంతో కాలనీ లో నెలకొన్న అన్ని సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని, కాలనీ లో అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీ పనులను, రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తామని, మంజీర మంచీ నీటి వసతిని మెరుగుపరుస్తామని, మయూరి నగర్ కాలనీలో దశల వారిగా అన్ని పనులు పూర్తి చేసి కాలనీ లో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని, అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మయూరి నగర్ కాలనీ వాసులు రామరాజు, సోమేశ్వర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి,వెంకట్ రావు, మురళీకృష్ణ, చిరంజీవి, లలిత్ బాబు, అనూష, బాలకృష్ణ, కోటేశ్వరరావు, శరత్,మరియు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి పథకం మహిళల ఆర్థిక శక్తి వంతం కోసం కీలకంగా పని చేస్తుంది

### డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి



సికింద్రాబాద్, ఆగస్టు 31 (వాయిస్ టుడే ప్రతినిధి): మహిళా శక్తి పథకం మహిళల ఆర్థిక శక్తి వంతత కోసం కీలకంగా పని చేస్తుందనీ నగర డిప్యూటీ మేయర్ మొదట శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకం లో భాగంగా శనివారం రోజు తార్నాక డివిజన్, లాలాపేట్ లోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం వద్ద మహిళా క్యాంటీన్ ను గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా, డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ వచ్చే ఐదు సంవత్సరాలలో మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇంద్ర మహిళ శుద్ధి పథకాన్ని శ్రీకారం చుట్టిందని తెలిపారు, ఈ క్యాంటీన్ మహిళల స్వయం ఉపాధికి ముఖ్యమైన మద్దతు అని పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో జిహెచ్ఎంసి డి పీ ఓ శ్రీనాథ్, శ్రీవాణి,మహిళా సెల్ఫ్ హెల్త్ గ్రూప్ సభ్యులు, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



శేరిలింగంపల్లి, ఆగష్టు 31(వాయిస్ టుడే): శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు భారీ వర్షాల పట్ల ప్రజలందరూ అప్రమత్రంగా ఉండాలని వర్షాల వల్ల ఎటువంటి సమస్యలు ఎదురైనా అధికారులు లేదా తమ దృష్టికి తీసుకురావలని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సూచించారు. వాతావరణ శాఖ సూచనల మెరకు అప్రమత్రంగా ఉండలని ఎడతెరిపి లేకుండా కురుస్తున్నా భారీ వర్షాల కారణంగా, ప్రజలు, ప్రతి కాలనీ వాసులు, అత్యవసరం ఉంటే తప్ప తమ ఇండ్ల నుంచి ఎవరు బయటకి రావద్దని, ఎవరు బయటకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి ఇబ్బందులు కలిగిన,ఎలక్ట్రికల్, రోడ్డు, డ్రైనేజీ, మంచి నీటి వంటి సమస్య లు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు గాని, తమ మా కార్యాలయాన్ని సంప్రదించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. అదేవిధంగా వర్షాలను దృష్టిలో పెట్టుకుని లోతట్టు ప్రాంతాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, జీహెచ్ఎంసీ అధికారులు మరియు మాన్ సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ , ప్రజలు అభద్రతకు లోను కాకుండా ధైర్యంగా ఉండలని, వర్షాలు పడుతున్న సమయంలో ఇంటి నుండి బయటకి రాకుండా ఉండలని తప్పని పరిస్థితుల్లో బయటకి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదేవిధంగా అధికారులు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలు , నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఇబ్బంది కల్గకుండా, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని,అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిత్యం ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ,ఎక్కడ ఏ సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చూడాలని అధికారులకు తెలియచేసారు. నిత్యం అందుబాటులో ఉంటానని ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి గాని మా కార్యాలయం దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని, అదేవిధంగా వర్షకాలంను దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తెలిపారు.

## బఫర్ జోన్‌లో ఇండ్లు కట్టి పట్టాలు చేసి అమ్మి డబ్బులు తీసుకుని మోసం చేసిన వారి ఇళ్ల వద్ద పోరాటం చేద్దాం

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం



కూకట్‌పల్లి, ఆగష్టు 31(వాయిస్ టుడే): కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు నిన్న హైడ్రా కమీషనర్ కు వినతి పత్రాలు ఇచ్చి ఫోటోలు దిగి వాళ్ళందరూ ప్రజల దగ్గరికి వచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలను సత్యం శ్రీరంగం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం ఎమ్మెల్యే కు సవాలు చేస్తూ నేను చాలా స్పష్టంగా అనేక వీడియోలలో కమిషనర్ తో సహా గాంధీ భవన్‌ప్రెస్‌తో సహా స్పష్టంగా చెప్పానన్నారు. తాను గత ఎనిమిది సంవత్సరాల నుంచి కూకట్ పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకుని రోడ్ల మీద పోరాటం చేశానని, అనేక సమస్యల మీద పోరాటం చేశానన్నారు. ఎమ్మెల్యే ఆరోపణ చేసినట్టుగా డబ్బులు వసూలు చేసే చరిత్ర నాకు లేదని, డబ్బులు వసూలు చేసే చరిత్ర మీ షాడో లకు మీ అనుచరులకు వాళ్లకే ఉందని అన్నారు. నేను చాలెంజ్ చేస్తున్నా దీనికి నేను సిద్ధంగా ఉన్నానని అన్నారు. విజయరామ రావు, జయప్రకాశ్ నారాయణ్ కాలంలోని చెరువుల మ్యాప్ లను, మాధవరం కృష్ణా రావు ఎమ్మెల్యే అయ్యాక ఈ పది సంవత్సరాల కాలంలో ఇప్పటి చెరువుల మ్యాప్ లు తీసుకుంటే ఎన్ని చెరువులు, నాళాలు ఆక్రమణలకు గురయ్యాయో తెలుస్తుందని ఆరోపించారు. దమ్ముంటే కాంగ్రెస్ పార్టీ తరుపు నుండి డబ్బులు వసూలు చేసిన వారిని చూపిస్తే కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నేను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాళ్ళని పార్టీ నుండి సస్పెండ్ చేపిస్తానని అన్నారు. పది సంవత్సరాల నుంచి మాధవరం కృష్ణా రావు ఎమ్మెల్యే బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాన మైసమ్మ చెరువు మరియు రంగనాయకి చెరువు సుందరీకరణ పేరుతో పెద్ద బడా బిల్డర్లకు అప్పచెప్పి అనేక మంది ప్రజా ప్రతినిధులు అందులో భాగస్వాములుగా ఉండి బఫర్ జోన్ లో ఇండ్లు కట్టి పట్టాలు చేసి అమ్మి సొమ్ము చేసుకుని, పేద ప్రజలకి అన్యాయం జరిగితే ఊరుకోము అంటున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న నాయకుల్ని గతంలో మీకు అమ్మి మీ దగ్గర డబ్బులు తీసుకున్న నాయకుల ఇళ్లకు వెళదాం అవసరమైతే మేము వస్తాం మిమ్మల్ని మోసం చేసింది వాళ్ళు కాంగ్రెస్ పార్టీ కాదు. మీకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని హామీ ఇచ్చారు.



## తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర క్లాసులు ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు 31(వాయిస్ టుడే స్టేట్ ప్రతినిధి): రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం శుభం కన్వెన్షన్ హాల్లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన రైతు ప్రాతినిధులతో అంగరంగ వైభవంగా ప్రారంభమైనవి. ప్రారంభ సూచికంగా ఏఐకేఎస్ జెండాను రైతు సంఘం రాష్ట్ర నాయకులు జంగారెడ్డి ఆవిష్కరణ చేయగా, ఈ శిక్షణ కార్యక్రమాలలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ , ప్రారంభ ఉపన్యాసం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, రైతుల కోసం ప్రకటించిన మద్దతు ధరలను చట్టబద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు బొంతల చంద్రారెడ్డి ,శోభన్ , హరి బండి ప్రసాద్, నాగయ్య, కందుల ప్రమీల,వివిధ జిల్లాల నుండి వచ్చిన రైతు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు శోభన్ అమరవీరులకు సంతాప తీర్మానం,ప్రకటించి , రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. జాతీయ ,అంతర్జాతీయ పరిస్థితులను రాష్ట్ర నాయకులు జి. నాగయ్య బోధించారు.



## వినాయక చవితి పండుగను సజావుగా జరుపుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలి

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

### సమయానికి సమీక్ష సమావేశానికి రాని అధికారుల మీద ఎమ్మెల్యే సీరియస్

### ఆర్ బి ఎస్ ఎస్సి ధర్మా రెడ్డి కి ఫోన్ చేసి వెంటనే రోడ్డు గుంతలు పుడ్చివేయాలని లేని యడల నా స్వంత నిధులతో నేనే చేస్తానని ప్రకటన

### ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీసు అధికారులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలు.

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్ మునిపల్ కార్యాలయంలో ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన వినాయక చవితి నిమర్జన ఏర్పాట్ల మీద అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి లు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరు సంతోషంగా జరుగుకోవాలని అన్ని శాఖల అధికారులు అన్ని ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి అని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి ఏసిపి చక్రపాణి ఉప్పల్ సి ఐ ఎలక్షన్ రెడ్డి , ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధురి ఈ ఈ నాగేందర్, ఎమ్మార్వో వాణి రెడ్డి, కార్పొరేటర్లు బన్నల గీత ప్రవీణ్ ముదిరాజ్, బండారు శ్రీవాణి వెంకట్ రావు తదితరులు పాల్గొన్నారు. అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వెనుకబడిన ఎరుకల జాతిని గుర్తించాలి

### ట్రై కార్ చైర్మన్‌ను కోరిన తెలంగాణ ఆదివాసి ఏరుకల సంఘం

సికింద్రాబాద్, ఆగస్టు 31 (వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్రంలో 40 లక్షల గిరిజన జనాభాలో 8 లక్షల జనాభా గలిగిన ఎరుకల జాతి వెనుక బడిపోయిందని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం పేర్కొంది. తెలంగాణ ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎరుకల సంఘం, ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లోకిని రాజు, కూతాడి రవికుమార్ నేతృత్వంలో శనివారం నగరంలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం లోకిని రాజు, కూతాడి రవి కుమార్ మాట్లాడుతూ తరతరాలుగా ఎరుకల జాతి తీవ్రంగా నష్టపోతున్న ప్రభుత్వాలు మారుతున్న జాతి అభివృద్ధి చెందడం లేదన్నారు. విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ సామాజికంగా వెనుకబడి ఉన్న గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఏమాత్రం న్యాయం జరగకపోగా నిర్లక్ష్యానికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ మేరకు ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ నియమించాలని కోరారు. కనీసం రాజకీయంగా నామినేటెడ్ పదవులు కూడా నోచుకోలేని పరిస్థితిలో ఎరుకల జాతి ఉండడం బాధాకరమన్నారు. ఇతర గిరిజన తెగలకు చెందిన ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు కొనసాగుతున్న ఎరుకల జాతి మాత్రం రాజకీయంగా నెట్టివేయబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎరుకల జాతిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్, ఆనంద్, కూరాకుల శ్రీనివాస్, పాత పల్లి నరసింహ, యాదగిరి, ఎల్లయ్య, రస్తా పురం సత్యనారాయణ, శ్రీరాములు, మదన్ గోపాల్, కూరాకుల విజయ, చిన్న ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
ఆదివారం, 1 సెప్టెంబరు 2024



## దళిత ఎమ్మెల్యే వేముల వీరేశంను అవమాపరిచిన పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలి

### మాజీమున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– దళిత ఎమ్మెల్యే వేముల వీరేశం ను అవమాపరిచిన పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కేంద్రంలో జగ్జివన్ రాం విగ్రహం వద్ద ఎం ఆర్ పి ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చెశారు. అనంతరంబర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నీటిపారుదల శాఖ మంత్రివర్యులు శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటనలో భువనగిరి లో ఈరిగేషన్ శాఖ సమీక్ష సమావేశానికి నీటి పారుదల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి భువనగిరికి విచ్చేసిన సందర్భంగా హెలిప్యాడ్ వద్దకు స్వాగతం పలకడానికి వెళుతున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంని పోలీసులు గుర్తుపట్టకపోవడం చాలా సిగ్గుచేటు విషయమని అన్నారు. ఎందుకంటే విరేశం గత 15 సంవత్సరాలు ప్రజాక్షేత్రంలో ఉంటూ రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా పనిచేస్తున్నాడన్నారు.భువనగిరి నియోజకవర్గం పక్కన ఉన్న నియోజకవర్గం నిరంతరం ప్రజలలో ఉండే వ్యక్తి వీరేశం అన్న ను గుర్తుపట్టకపోవడం చాలా బాధాకర విషయం వీరేశం అన్న దళితుడని మరియు అగ్రకుల కుట్రల ద్వారా విరేశం అన్న కి అవమానకరం జరిగింది ఈ సంఘటనకి సంబంధించిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు భవిష్యత్తులో ఇలాంటి విషయం మళ్ళీ పునరావతం కావద్దని ఈ సందర్భంగా తెలియజేస్తు ఎవరైతే అధికారి ఉన్నారో వారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని కోరారు. లేని యెడల జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దీనావత్ రాజేష్ నాయక్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ ఎంఆర్పిఎస్ జిల్లా కార్యదర్శి బండారు శివశంకర్ మాదిగ ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు రాజు నాయక్ జర్నలిస్ట్ ఫోరం నాయకులు బండారు జగదీశ్వర్ మాదిగ బీజేవైఎం పట్టణ అధ్యక్షులు కనుకుంట్ల రమేష్ కుమార్,డాకూరి ప్రకాష్,గందమల్ల మాతయ్య, దాసరి అశోక్,దర్గాయి దేవేందర్,పల్లార్ల సహదేవ్,అంజయ్య,బాలకృష్ణ శంకర్, కోళ్ల జహంగీర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేస్తున్నందుకు సిఎంకు ధన్యవాదాలు

### ఆలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– టిటిడి తరహాలో యదగిరిగుట్టలో టెంపుల్ బోర్డు ఏర్పాటు చేస్తున్నందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డికి ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.శనివారం రోజు యదగిరిగుట్ట లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ టిటిడి తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్ట ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. టిటిడి అనుసరించిన తరహాలోనే యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ద్వారా స్వయం ప్రతిపత్తి, విధి విధానాలు ఉండేలా అవసరమైతే చట్ట సవరణ చేయడం ద్వారా యాదగిరిగుట్ట ఆలయం అభివృద్ధి జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు.యాదగిరిగుట్ట అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించి ఆలయ అభివృద్ధికి కృషి చేయడం అదృష్టంగా బావిస్తున్నామన్నారు. దీంతోపాటు యాదగిరిగుట్ట ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులను ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు.గత ప్రభుత్వంలో యాదాద్రి ఆలయ అభివృద్ధి పనులు చాలా వరకు అర్ధవంతరంగా నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని,ఇప్పటి వరకు జరిగిన పనులపై నివేదికను అందించాలని ఆదేశించడం శుభ పరిణామం అన్నారు.టూరిజం చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డికి కూడా ఆలేరు నియోజకవర్గం ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టూరిజం లో భాగంగా యాదగిరిగుట్టలో అన్ని సౌకర్యాలు, అహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి టూరిజం చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి కూడా కృషి చేస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎండోమెంట్ మినిస్టర్ కొండా సురేఖ నాయకత్వంలో ఇప్పటికీ పూర్వ వైభవం కోసం అనేక అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు.

## నిమ్మానిని కలిసిన మందకృష్ణ



వాయిస్ టుడే, వరంగల్ జిల్లా: కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్, సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్ రావు ను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ శనివారం హన్మకొండలో నిమ్మాని శేఖర్ రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన సందర్భంగా కాంగ్రెస్ నేత శేఖర్ రావు మందకృష్ణ కు మిఠాయి తినిపించారు. ఎస్సీ వర్గీకరణ అనేది నిజంగా న్యాయబద్ధ పోరాటం అని.. ఎలాంటి కల్మషం లేకుండా, ఏ పదవులు ఆశించకుండా సుమారు ముప్పైఏళ్ళు ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ కు మనసార శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని శేఖర్ రావు తెలిపారు. ఉద్యమసయంలో మాదిగ ఉద్యమకారులపై ప్రభుత్వాలు పెట్టిన అక్రమకేసులు కొట్టుడుపోయేవిధంగా వాదించిన న్యాయవాది శేఖర్ రావు కు తాను ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ తెలిపారు. ఈ సమావేశంలో న్యాయవాదులు గోపిక, ఎంఆర్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లను దిగ్విజయంగా నిర్వహించాలి

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జండగే



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– గణేష్ నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లను దిగ్విజయంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జండగే అధికారులను ఆదేశించారు. శనివారం రోజున కలెక్టరేట్ సమావేశం మందిరంలో గణేష్ నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లను ఆయన డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్ చంద్ర, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి లతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, భక్తులకు, ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఏర్పాట్లు చేయాలని, వినాయకుల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాపులు సిద్ధం చేసుకోవాలని, అవసరమైన రూట్లలో రోడ్ల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని తెలిపారు. వినాయక చవితి నిమజ్జనానికి చెరువుల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఫస్ట్ ఎయిడ్ కిట్లను మెడికల్ ఆఫీసర్, సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. వినాయక నిమజ్జన స్థలాల వద్ద భారీ క్రేన్లను ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనం సాయంత్రం వేళ జరుగుతున్నందున నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటినుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వినాయక నిమజ్జన సమయంలో విద్యుత్ తీగల సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తూ ప్రతి చెరువు దగ్గర విద్యుత్ సిబ్బందిని అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో మండపాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలన్నారు.గణేష్ నవరాత్రులు మొదలుకొని నిమర్జనం పూర్తయ్యే వరకు అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండపాలలో అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలి అనే వాటి మీద అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా పండగ వాతావరణంలో జరుపుకునేందుకు సహాయ సహకారాలు అందివ్వాలని తెలిపారు. గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై మండల స్థాయిలో, గ్రామాలలో సమన్వయ మీటింగులు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్ చంద్ర మాట్లాడుతూ.. ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు, గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, విగ్రహాలకు తగ్గట్లుగా వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని, నిమజ్జనానికి వినియోగించే వాహనాలకు కండిషన్లో ఉన్న వాహనాలను ఉపయోగించాలన్నారు. గణేష్ నిమజ్జనానికి తరలించే వాహన డ్రైవర్లు నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. శాంతి భద్రతలు పరిరక్షించే విధంగా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి సంఘం సభ్యులు, ఉత్సవ కమిటీల సభ్యులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తహసిల్దారులు పాల్గొన్నారు.




## జలసంద్రంగా మారిన జడ్చర్ల 100 పడకల ప్రభుత్వం ఆసుపత్రి

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా ఆగస్టు 31: జడ్చర్ల నియోజకవర్గం లో అర్ధరాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తుంది. దీంతో జడ్చర్ల పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలు తడిసి ముద్దయ్యాయి. వర్షపు నీరు జడ్చర్ల పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని చుట్టుముట్టడంతో ఆస్పత్రి జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో ఆస్పత్రికి వచ్చి పోయే రోగులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఆసుపత్రిలోని ఇన్ పేషెంట్లు భయాందోళనకు గురయ్యారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని రహదారులపై వర్షపు మీరు నది ప్రవాహాలను తలపించింది. దీంతో వాహనదారులు ప్రయాణికులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని వివిధ కాలనీలో ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి వర్షపు నీరు చేరడంతో ఇళ్లలోని ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. దీంతోపాటు లింగంపేట చర్లపల్లి చెక్ డ్యాం లు నిండి అలుగు దుంకుతుండడంతో కొడంగల్ లింగంపేట్ ప్రధాన రహదారిపై నుంచి వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి. దీంతోపాటు జడ్చర్ల మండలంలోని కోడుగల్ వద్ద దుందుభి నది ఉరకలు పెడుతూ పారుతుంది. మరియు నదిలోనే చెక్ డాంల నుండి మత్తడి దుంకుతుంది. మండల పరిధిలోని నసురుల్లాబాద్ చెరువు నుండి ముత్తడి దుంకుతుంది మరొక చర్లపల్లి నసురుల్లాబాద్ గ్రామాల ప్రధాన రహదారిపై నుంచి భారీ ఎత్తున వర్షపు నీరు ముత్తటి నీరు ప్రవహిస్తుండడంత వయా ఆందోళన గురవుతున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు.




## ప్రిన్స్ మహేష్ బాబు వారసుడు గౌతమ్ కృష్ణ పుట్టినరోజు వేడుకలు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 31 (వాయిస్ టుడే) : ప్రముఖ నటుడు మహేష్ బాబు కుమారుడు గౌతమ్ కృష్ణ పుట్టినరోజు వేడుకలు జంగారెడ్డిగూడెం లో మహేష్ బాబు యువసేన అధ్యక్షులు బవిరిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యం లో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో, గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారి ఆలయంలో ఆంజనేయ స్వామి వారి ఆలయంలో, అలాగే పుట్టపర్తి సాయి బాబా ఆశ్రమంలో గోత్రనామాలతో విశేష పూజలు కుంకుమార్చనలు నిర్వహించారు, స్థానిక వంద పడకలు గవర్నమెంట్ హాస్పిటల్ లో అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ బాబు అభిమానులు ఎస్.కె రజియాక్ సమర,పుట్టపర్తి సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

## రాజానగరం తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ప్రశాంతి

**కంట్రోల్ రూం పరిశీలించిన కలెక్టర్**

**ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ పై ఎంపిడిఓ లతో సమీక్షా**



రాజానగరం, ఆగస్టు 31 (వాయిస్ టుడే) రాజానగరం తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులను, ఆన్లైన్ లో నమోదు చేసిన వాటి వివరాలను పరిశీలించారు. మండల పరిధిలో మ్యుటేషన్ కు చెందినా ఫైల్స్, వాటి నిర్వహణా తీరును కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత మ్యుటేషన్ కు చెందిన వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ నమోదు చేయాలని ఆదేశించారు.వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కంట్రోల్ రూం లను 24 X7 అందుబాటులో ఉండే విధంగా విధులను కేటాయించాలని , ఆమేరకు కేటాయించిన సంబంధిత రికార్డులను పరిశీలించారు. పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ఎంపిడిఓ లతో పెన్షన్ల పంపిణీ ప్రగతి పై సమీక్షా నిర్వహించారు.

## ఉద్యోగ విరమణ చేసిన అధికారికి సత్కారం



కాకినాడ, ఆగస్టు 31 (వాయిస్ టుడే) జిల్లా పోలీస్ శాఖలు సుదీర్ఘ కాలం విధులు నిర్వహించిన ఎస్సై నీలాకు నాగేంద్ర రామారావు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం నుండి రావాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను అతి త్వరగా ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలనా అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పరిపాలన ఎం జే వి భాస్కర రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన ఎస్జిఎఫ్ క్రీడోత్సవాలు

వాయిస్ టూ డే (జిన్నారం మండల్ ప్రతినిధి ) సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్ర సమీపంలోని గిరిజన గురుకుల పాఠశాల ప్రాంగణంలో గత రెండు మూడు రోజులుగా జరిగిన 68వ ఎస్జిఎఫ్ క్రీడోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగించారు. కబడ్డీ కోకో వాలీబాల్ క్రీడల్లో విద్యార్థులుగా నిలిచిన క్రీడాకారులకు జిన్నారం ఇన్చార్జ్ ఎంఈఓ జెమినీ కుమారి మండల నోడల్ అధికారి కుమారస్వామిలు బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించిన విద్యార్థులు జిల్లా స్థాయిలో కూడా రాణించాలని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మృదుల మేడం , విజయ్ కుమార్, సంధ్యారాణి, మంగీలాల్ ,పీటీలు, శశిరేఖ ,పవన్ ,రాజ్, రమేష్ గౌడ్ ,రవీందర్ రెడ్డి, అను , ఎస్ ఎం సి చైర్మన్ ఏర్పుల భాస్కర్, మరియు ఉపాధ్యాయులు మొగిలి మాల సత్యనారాయణ ,త్రిశూల్లార్డ్, అనిల్ కుమార్, వేణు, రాజిరెడ్డి, ప్రదీప్ ,ఆనంద్, ఆయా పాఠశాల క్రీడాకారులు పాల్గొన్నారు.





# చేనేత కార్మికులకు ప్రభుత్వ ప్రోత్సాహం

**జిల్లా కలెక్టర్ ప్రశాంతి..**

**చేనేత వస్త్రాలను కొనుగోలు చెయ్యండి..**

**హస్తకళల అభివృద్ధికి ప్రభుత్వం రాయితీలను అందిస్తోంది**

**ఆగస్టు 30వ తేదీ నుండి సెప్టెంబర్ 5వ తేదీ వరకు నగరంలో చేనేత జౌళి ప్రదర్శన..**

**శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఫంక్షన్ హాల్‌లో హస్తకళలు, కళాత్మక వస్త్రాల ప్రదర్శన**



రాజమహేంద్రవరం, ఆగస్టు 31 (వాయిస్‌టుడే): వివిధ ప్రాంతాల నుండి హస్తకళాకారులు, నేత కార్మికుల కళాత్మకంగా తయారు చేసే ఉత్పత్తులు వినియోగదారులకు అందించే క్రమంలో గాంధీ శిల్ప బజార్ వేదికను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం స్థానిక జాంపేట శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఫంక్షన్ హాల్ లో హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆగస్టు 30వ తేదీ నుండి సెప్టెంబర్ 5వ తేదీ వరకు నిర్వహించనున్న హస్తకళలు, కళాత్మక వస్త్రాల విక్రయ ఎగ్జిబిషన్ ను జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించి, వివిధ స్టాల్స్ సందర్శించారు. కార్యక్రమంలో స్థానిక సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు, రాష్ట్ర హస్త కళాకారుల సంస్థ ఈ డీ – ఎమ్. విశ్వ , అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.అపర్ణ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హస్తకళల అభివృద్ధికి, చేతివృత్తులు, చేనేత కార్మికులను ప్రోత్సహిస్తూ రాయితీలను అందిస్తుందన్నారు. భారత ప్రభుత్వం సహకారంతో వినియోగదారుల అభిరుచికి అనుకూలంగా ఉత్పత్తులను తయారుచేసి ఇటువంటి వేదికల ద్వారా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రాజమహేంద్రవరం నగర ప్రజలందరూ ఈ ఎగ్జిబిషన్ ఈ సందర్శించి ఇక్కడ ప్రదర్శించిన కళాత్మకమైన ఉత్పత్తులు డార్మెట్స్, హౌస్ డెకరేషన్ మెటీరియల్, హ్యాండ్ బ్యాగ్స్ మరియు వివిధ రకాల డిజైన్ శారీలను కొనుగోలు చేయడం ద్వారా చేతివృత్తుల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. కళకు వెల కట్టలేమని ఈ ప్రదర్శనలో ఉంచిన ప్రతి వస్తువు కళాత్మకతగా వున్న ఉత్పత్తులని నగర ప్రజలందరూ ఈ ఎగ్జిబిషన్ ను తిలకించి హస్తకళల అభివృద్ధికి, గుర్తింపు తగిన ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం హస్తకళలు, చేనేత కార్మికులను ప్రోత్సహిస్తూ వారి ప్రతిభకు గుర్తింపుగా హ్యాండ్ క్రాఫ్ట్ డిపార్ట్మెంట్ ఇటువంటి ప్రదర్శనలు వారి విశిష్టతను తెలిపే విధంగా ఇవ్వడం శుభ పరిమాణం అన్నారు. రాజమహేంద్రవరం నగరంలోని పౌరులకు తమ హస్త కళాకారులు, చేనేత కార్మికులు తయారు ఉత్పత్తులను విక్రయించడానికి ఈ ఎగ్జిబిషన్ చక్కని వేదికని, నగర ప్రజలందరూ ఈ చెప్పిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హస్త కళలు, చేనేత ఉత్పత్తులు అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎమ్.విశ్వ మాట్లాడుతూ గాంధీ శిల్ప బజార్ను డెవలప్మెంట్ కమీషనర్ (హస్తకళలు), డిసి (హెచ్) కార్యాలయం, టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ స్పాన్సర్ చేస్తుందన్నారు. ఈ గాంధీ శిల్ప బజార్ 30 ఆగస్టు నుండి 5 సెప్టెంబర్ 2024 వరకు ఆదివారాలు మరియు ప్రభుత్వ సెలవు దినాలతో సహా 7 రోజులు ప్రతిరోజు ఉదయం 11:00 గంటల నుండి రాత్రి 9:00 వరకు ప్రజలకు తెరిచి ఉంటుందన్నారు. భారతదేశం నలుమూలల నుండి దాదాపు 50 మంది హస్తకళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొనడం జరుగు తుందన్నారు. ఇక్కడ వారు వివిధ రకాల హస్తకళలు మరియు చేనేత ఉత్పత్తు లను ప్రదర్శిస్తారని, ఈ ఏడాది జరిగే కార్యక్రమంలో కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, చెక్కబొమ్మలు, తోలు బొమ్మలు, మచిలీపట్నం నుంచి కృత్రిమ ఆభరణాలు, మదనపల్లి నుంచి కుండలు, ఏలూరు నుంచి తివాచీలు, నర్సాపూర్ జరీ వస్తువులు, మచిలీపట్నం, వెంకటగిరి, మంగళగిరి నుంచి కలంకారి బ్లాక్ ప్రింట్లు ఉంటాయి. ఉప్పాడ చీరలు, బీహార్ నుండి బగల్పూర్ సిల్క్, మధ్య ప్రదేశ్ నుండి కోసా చీరలు, కాశ్మీరి సిల్క్ మరియు బెంగాల్ కాటన్లు, ఆంధ్ర ప్రదేశ్ మరియు భారతదేశంలో గల వివిధ ప్రాంతాల నుండి హస్తకళాకారులు, నేత కార్మికులు మరియు తయారీదారులు గాంధీ శిల్ప బజార్లో తమ కళాత్మక హస్తకళలు మరియు వస్త్రాలను ప్రదర్శించడంతో పాటు వినియోగదారులకు విక్రయించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## వృద్ధుల పట్ల ప్రేమ ఆప్యాయతతో మెలగాలి: రిటైర్డ్ టీచర్ పాపన్న



వాయిస్ టుడే వనపర్తి జిల్లా : వనపర్తి జిల్లా కేంద్రంలోని వృద్ధాశ్రమంలో మద్దిగట్ల మోజర్ల జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల 1997–98 విద్యార్థులు ఏదో ఒకటి అందరూ కలిసి చేయాలనే ఉత్సాహంతో ప్రతి సంవత్సరం ఏదో కార్యక్రమం చేస్తూ వనపర్తి లో నందవరం వృద్ధాశ్రమం నందు రెండవసారి విద్యార్థులు శ్రావణ శనివారం చివరి రోజు సందర్భంగా వృద్ధులను కూడ ఆనంద పరచాలని ఉద్దేశంతో వారితో కలిసి నేడు భోజనం చేయడం మా అదృష్టంగా భావిస్తున్నా మని విద్యార్థులు తెలిపారు. అదే విధంగా వారి కోసం నిత్యావసర వస్తువులను అందిస్తూ తమ వంతు సహకా రాన్ని యాజమాన్యానికి సహక రిస్తామని మాట ఇచ్చారు. నేటి కార్యక్రమంలో ఆ పాఠశాల విద్యార్థుల గురువు పాపన్న ముఖ్య అతిథులుగా ఆహ్వానించి వారి దీవెనలు తీసుకున్నారు. అనంతరం కార్యక్రమంలో రాజేశ్వర్ రెడ్డి పద్మ 23వ వివాహ దినోత్సవ సందర్భంగా వారిని కూడ పూలమాల శాలువాలతో అభినందించి వృద్ధుల మధ్య ఇలాంటి కార్యక్రమాలు చేసుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చాయని మా పాతిక ఏళ్ల జీవిత మా నడవడికల్లో భాగంగా మేము ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తు న్నాము. విద్యార్థుల కుటుంబ సభ్యులకు కూడ ఆశ్రమ నిర్వాహకులు ధన్యవాదాలు తెలుపుకున్నారు. గతంలో వృద్ధుల కోసం మంచాలు ఇతర సామాగ్రిని ఏర్పాటు చేసి నందుకు ఇతరులు కూడ ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వృద్ధుల పట్ల దయ గుణంతో సహకారం అందించాలని నిర్వాహకులు కోరారు. వెంటనే రిటైర్డ్ టీచర్ పాపన్న వృద్ధుల కోసం నా వంతు సహకారంగా 2000 అందించి ప్రతినెల రూ2000 చొప్పున పంపిస్తానని హామీ ఇచ్చారు. న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంకు వారు 50 కేజీల బస్తా బియ్యాన్ని ఈ సందర్భంగా వారు అందజేశారు. జీవితంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ మేము కూడ మా కుటుంబ బాధ్యతలను స్వీకరించి సమాజ సేవ కోసం కూడ మా వంతు సహకారాన్ని అందించి మా చిన్ననాటి మిత్రులందరికీ ఒకచోట కలుసుకొని ఒక ఉమ్మడి కుటుంబంలా ఉంటూ మా యొక్క పరస్పర అభిప్రాయా లను పంచుకుంటూ ఆనందం గా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం మాకు సంతోషంగా ఉందని విద్యార్థులు తెలిపారు.

# మత కలహాలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**చాణక్య స్కూల్ ఘటనలో కేసు నమోదు**

**అన్ని వర్గాల ప్రజలకు పోలీసుల సూచన, మత సామరస్యాన్ని కాపాడుదాం**

**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్**



వాయిస్ టుడే వనపర్తి జిల్లా : జిల్లా పోలీస్ మతకలహాలు జరగకుండా చూస్తామని పూర్తి నమ్మకం ఉందని సంతోషం వ్యక్తం చేసిన మత పెద్దలు. బయటి వ్యక్తులపై పోలీసుల ప్రత్యేక నిఘా.వనపర్తి పట్టణం లో ఈ నెల 23న చాణక్య ఉన్నత పాఠశాలలోని ఓగదిలో నమాజ్ చేసుకున్నారనే విషయంపై వనపర్తి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారని జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ ఐపీఎస్ తెలిపారు. సున్నితమైన ఈ అంశంపై రాదాంతం చేయరాదని, పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే శక్తులకు అవకాశం ఇవ్వవద్దనే సదుద్దేశం తో ఇరువర్గాల పెద్దలు పోలీసు లకు సహకరించారు.చిన్న చిన్న సంఘటనలు సాకుగా చూపి వనపర్తి పట్టణంలో అరాచక శక్తులు చెలరేగే ప్రయత్నం చేస్తే చట్టం చూస్తూ ఊరుకోదని అరాచక శక్తులను జిల్లా ఎస్పీ హెచ్చరించారు.ఇలాంటి సమ యంలోనే ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులకు సహకరించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే శక్తుల ఆట కట్టించాలని ఆయన ప్రజలకు సూచించారు.వనపర్తి జిల్లా పోలీస్ యంత్రాంగంపై మాకు పూర్తి నమ్మకం ఉందని వ్యక్తం చేసిన హిందూ ముస్లిం మత పెద్దలు వనపర్తి జిల్లాలో అందరూ అన్నదమ్ముల వలె పండుగలు కలిసిమెలిసి చేసుకుంటాము.బయట హైదరాబాద్ ఇతర ప్రదేశాల నుంచి వచ్చిన వ్యక్తులు అనవసరంగా మత కలహాలు సృష్టించాలని ఉద్దేశంతో సోషల్ మీడియాలో అసత్యపు మెసేజ్ లు ఫార్వర్డ్ చేసి పబ్లిక్ ను పక్కదోవ పట్టిస్తున్నారని మత పెద్దలు అన్నారు. మహమ్మద్ అబ్జాలుద్దీన్ వనపర్తి జామ మజీద్ సెకరెటరీ.కుల మతాలకు అతీతంగా సోదర భావంతో ఉన్న వనపర్తి పట్టణ ప్రజల మధ్య మత పరమైన వివాదాలకు కుట్రలు చేస్తున్న వారిని గుర్తించాలని ముస్లిం మత పెద్దలుగా తాము పోలీసులను కోరుతున్నాము.

ఇలాంటి మతపరమైన అరాచకాలకు వనపర్తి పట్టణ ప్రజలు సహకరించరని, ఇతర ప్రాంతాల నుండి అసాంఘిక శక్తులు ఏవైనా పట్టణంలో చొరబడినట్లైతే వారిపై నిఘా పెట్టి గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుని శాంతి భద్రతలు కాపాడాలని పోలీసులను వారు కోరారు. ఈ విషయంలో పోలీసులకు మత పెద్దలుగా తమ సహాయ సహ కారాలు ఎప్పుడు అందిస్తామని వారు పోలీసులకు హామి ఇచ్చారు.వనపర్తి జిల్లా అధ్యక్షులు బిజెపి నారాయణ. వనపర్తి పట్టణ ప్రజలు చాలా విజ్ఞానవంతులు, శాంతి కాముకులు మత పరమైన వివాదాల్లో తలదూర్చరని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని వ్యతిరేకిస్తారని మేము కూడా రాజకీయాలకు అతీతంగా పోలీసులకు సహక రిస్థాము.జబ్బార్ సిపిఎం కార్య దర్శి.వనపర్తి జిల్లా చాణక్య హై స్కూల్ ఘటనను సాకుగా చూపి వనపర్తి పట్టణంలో ప్రజలను ఇబ్బంది పెట్టే అరాచక శక్తుల ఆట కట్టించాలని పోలీసులను కోరుతున్నాను. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎంతటి శక్తులైనా వారి కుట్రలను చేదించాలని ఈ విషయంలో పోలీసులకు తమ సంపూర్ణ సహకారం అందిస్తాం. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అదనపు ఎస్పి శ్రీ రాందాస్ తేజావత్, వనపర్తి డిఎస్పి శ్రీ వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, ముని నాయక్, వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్, నాగభూషణరావు, ఇన్స్పెక్టర్, అప్పల నాయుడు వనపర్తి పట్టణ 2వ, ఎస్ఐ రామరాజు, అన్ని మతాల కుల పెద్దలు వనపర్తి బిజెపి జిల్లా అధ్యక్షుడు నారాయణ సిపిఐ జిల్లా అధ్యక్షుడు జిల్లా జామ మజీద్ సెక్రెటరీ అబ్జలుద్దీన్, మైనారిటీ అధ్యక్షులు మునీరుద్దీన్, రహీం , ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అప్సర్ పత్రికా మీడియా మిత్రులు పాల్గొన్నారు.



## జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలి

**మాదిగలను మోసం చేస్తున్న మందకృష్ణ**

**పార్లమెంట్ లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి**

**జిల్లాల వారిగా ఎస్సీ వర్గీకరణ జరగాలి**

**రౌండ్ టేబుల్ సమావేశంలో మాదిగ జేఏసీ సమావేశం**

వాయిస్ టుడే, వరంగల్ జిల్లా: దేశంలో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని మాదిగ కులసంఘాల నాయకులు, మాదిగ ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కాజీపేట ఫాతిమానగర్ లోని బాలవికాస కేంద్రంలో మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు మైసా ఉపేందర్ మాదిగ అధ్యక్షతన జరిగిన మాదిగ సంఘాల వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, మరియు అన్ని కులసంఘాల నాయకులతో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ లు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పును గౌరవిస్తూ తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఎంఆర్పిఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మాదిగలను మోసంచేస్తున్నాడని, ముప్పై ఏళ్ల క్రితం ఉన్న మాదిగ జనాభా ప్రకారం ఆయన 7%శాతం రిజర్వేషన్ కావాలని అడగడం తప్పు అని, ఇప్పుడున్న మాదిగ జనాభా ప్రకారం మనకు 12శాతం నుండి 15శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులో మందకృష్ణ కష్టం ఏమిలేదని, నిజంగా మందకృష్ణ కు మాదిగల మీద చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టించి దానిని పాస్ చేపించి తరువాత రాష్ట్రాలలో, జిల్లాలలో జనాభా ప్రకారం రిజర్వేషన్ అమలుకు పోరాటం చేయాలని పిడమర్తి రవి అన్నారు. ఈ ఉద్యోగ నోటిఫికేషన్ లలో మాదిగలకు అన్యాయం జరగకుండా వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని మాదిగలకు ఉద్యోగ, విద్యా, రాజకీయ రిజర్వేషన్లు పెంచి అమలు చేయాలని వక్తలు కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి మైసా ఉపేందర్ మాదిగ కృతజ్ఞతలు తెలిపినారు. ఈ సమావేశంలో టిఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బొట్ల భిక్షపతి మాదిగ, జనగాం నర్సింగ్, ఉద్యోగ సంఘాల నాయకులు గోవిందు నవీన్ కుమార్ వీరాస్వామి, బండ శ్రీనివాస్, జన్ను మధు (బీజేపీ), గంగారపు అమృతరావు(కాంగ్రెస్), అరూరి రంజిత్, పరం జ్యోతి, అనిల్, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళా చట్టాలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం

**పని ప్రదేశంలో లైంగిక వేదింపుల నుండి మహిళలకు పోష్ ఆక్ట్ నుండి రక్షణ**

**మహిళా సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఫైనాన్సియల్ :ట్రేసీ సుమ**

వాయిస్ టుడే వనపర్తి జిల్లా : మహిళలు పనిచేసే చోట ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురైనప్పుడు పోష్ ఆక్ట్ 2013 ప్రకారం లైంగిక వేధింపులు చేసిన వారిని చట్ట ప్రకారం శిక్ష పడుతుందని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్షియల్ స్పెషలిస్ట్ సుమ అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండలంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది సుమ శనివారం అంగన్వాడి టీచర్లకు మహిళా చట్టాలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన చేశారు. ఈ కార్య క్రమంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఉద్యోగస్తులు పని చేసే ప్రదేశంలో ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురైనచో పోష్ చట్ట ప్రకారం మహిళలకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం, వారి ఎదుగుదల కోసం అనేక చట్టాలు ఉన్నాయని చెప్పారు. బాల్యవివాహాలు, బాల కార్మి కులు, ఎవరైనా చిన్న వయసు లోని పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తే 1098, మహిళలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఏ సమయంలోనైనా 181, వృద్ధులకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు 14567 ఈ టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని ఆమె తెలిపారు. సైబర్ నేరాలలో భాగంగా ఎవరైన గుర్తుతెలియని వ్యక్తులు తమ బ్యాంక్ వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పకూడదని జాగ్రతపడాలని ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిట్రసి సుమ, అంగన్వాడీ సూపర్వైజర్ ఈదమ్మ, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ



రాజమహేంద్రవరం, ఆగస్టు 31 (వాయిస్ టుడే) జిల్లాలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. బ్లూ కోల్ట్స్ మరియు రక్షక్ మొబైల్ గంట గంటకు తమ లొకేషన్ మార్చుకుంటూ అప్రమత్తంగా తిరుగుతూ, తిరుగుతున్న లొకేషన్ కంట్రోల్ రూమ్ కి తెలియజేయాలన్నారు.ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పెంచాలన్నారు. తనిఖీ లలో భాగంగా పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల పరిసరాలను, రిసెప్షన్ కౌంటర్ మరియు స్టేషన్లో వివిధ రికార్డులను పరిశీలించి, నమోదైన గ్రేవ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం కేసులకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్ల లో సీసీ కెమెరాలను పరిశీలించి వాటి పనితీరుపై ఆరా తీశారు.పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన గ్రేవ్ కేసులలో పురోగతి సాధించాలని, శాంతి భద్రతలకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలని, అలాగే మద్యం, గంజాయి, నాటుసారా అక్రమ రవాణను నియంత్రించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ మరియు రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలని అన్నారు. ఎస్పీ సిబ్బందితో ముఖాముఖి మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
ఆదివారం, 1 సెప్టెంబరు 2024



## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారికి ఘనంగా సన్మానం

### జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్

వాయిస్ టుడే వనపర్తి జిల్లా : పోలీస్ శాఖలో వివిధ పోలీస్ స్టేషన్ లలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ గా. 40 సంవత్స రాల పాటు విధులు నిర్వర్తించి ఈరోజు పదవీ విరమణ చేసిన వనపర్తి జిల్లా సిసిఎస్ ఎస్ఐ మీస్పుద్దిన్, వనపర్తి స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ జానకి రాములును జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ ఐపీఎస్, జిల్లా పోలీస్ కార్యాలయం లోని సమావేశ హల్ నందు శాలువా పూల మాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కుటుంబాన్ని, వృత్తిని బ్యాలెన్స్ చేసుకుంటూ క్రమశిక్షణతో పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతూ సేవలు అందించడం గొప్ప విషయం అని, అందుకు ఆయన వెనుకుండి నడిపించిన కుటుంబ సభ్యులకు అభినంద నలు తెలియజేశారు.పదవీ విరమణ ప్రతి ఉద్యోగి జీవితం లో తప్పని సరి అని, పదవీ విరమణ పొందిన పోలీసు అధికారిని కుటుంబాల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకు న్నారు. తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని తెలిపారు. భవిష్యత్తులో ఏ విధమైన సహాయం కావాలన్నా వెంటనే తమను సంప్రదించా లని వారికి తెలియజేశారు.

పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి వారికి చెందాల్సిన జీపీఫ్ , ఇన్సూరెన్స్, భద్రత సాంక్షన్ బిల్స్ అందజేశారు.రావాల్సిన బెనిఫిట్స్ ను కూడ త్వరగా అందేలా చూడాలని సెక్షన్ అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా పోలీస్ శాఖలో వారు అందించిన సేవలకు గాను ఎస్పీ వారికి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ శ్రీ రాందాస్ తేజవాత్ వనపర్తి డిఎస్పి శ్రీ శ్రీనివాసరావు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ముని నాయక్, వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగభూషణ రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పల నాయుడు, పదవీపురం విరమణ పొందుతున్న ఎస్సై మరియు, హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు జిల్లా పోలీస్ కార్యాలయం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## వరదకాలువ, డి-40 నీటితో చెరువులను నింపుతాం

### నల్లగొండ పార్లమెంటు సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి

మాడ్గులపల్లి ఆగస్టు 30( వాయిస్ టుడే): వరదకాలువ, డి-40కాలువాల నీటితో మాడ్గులపల్లి మండల పరిధిలోనిచెరువులుకుంటలను నింపేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నా మని నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు కార్యకర్తలు రైతులతో ముచ్చటించారు. వరద కాలువాకు ప్రస్తుతం రెండు మోటార్ల తో నీటిని లిఫ్ట్ చేస్తున్నారని , మరో మోటార్ తో హైదరాబాద్ అవసరాలకు నీటిని లిఫ్ట్ చేస్తున్నారన్నారు. ఇంకొక రెండు మూడు రోజుల లో మరో మోటర్ ను నడిపించి వరద కాలువ నీటి ప్రవాహాన్ని పెంచి వరద కాలువ పరిధిలో ఉన్నటువంటి అనధికార తూములను మూసివేసి నీటిపారుదల శాఖ అధికారుల ప్రత్యేక పర్యవే క్షణలో వరద కాలువ చివరన ఉన్నటువంటి చెరువులుకుంట లను నింపేందుకు యుద్ధప్రతి పాదికన చర్యలు తీసుకోవా ల్సిందిగా సంబంధిత శాఖ ఎస్ఈ ని ఆదేశించడం జరిగిందన్నారు. చెరువులు నింపే విషయంలో రైతులు ఆందోళన చేయకుండా ఆలోచనతో నీటిపారుదల అధికారులను సమన్వయం చేసుకొని చెరువులు కుంటలు నింపే వరకు ఎక్కడి రైతులు అక్కడ స్వీయ పర్యవేక్షణ చేయాలనిఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న 2 లక్షల రుణమాఫీ పొందని రైతులు ఆందోళన పడకుండా తమ ఇంటి ముందుకు వచ్చే వ్యవసాయ అధికారులకు అవసరమైన సమాచారాన్ని అందించాలన్నారు. అర్హులైన రైతులందరి రుణాలను మాఫీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంకట్టుబడి ఉందన్నారు. మాడ్గులపల్లి మండల కేంద్రాని కి చెందిన వ్యాపారి అధిక వడ్డీ ఆశ చూపి సన్న చిన్న కారు రైతుల నుంచి అధిక మొత్తం లో డబ్బులు తీసుకొని పారి పోయిన విషయంలో తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు ఎంపీ రఘువీర్ రెడ్డిని మొరపెట్టుకున్నారు. వ్యాపారినినమ్మిమోసపోయిన రైతులకు న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, దామరచర్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల్ల శ్రీనివాస్, మాడ్గులపల్లి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పుల్లెంల సైదులు, డిసిసి ఉపాధ్యక్షుడు బట్టు మాధవరెడ్డి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లెంల నరసింహ,నాయకులు కట్టా సిద్ధార్థ రెడ్డి, వెంకట్ రెడ్డి, బక్కయ్య, జానయ్య, యాదగిరి, ముకుంద, తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రీషుని దర్శించుకున్న బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: శ్రీ లక్ష్మీ నరసింహస్వామినీ తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ కుటుంబ సమేతముగా స్వామి వారిని దర్శించుకున్నారు.అనంతరం ఆలయ ఈఓ భాస్కర రావు వారికి శ్రీ స్వామి వారి ప్రసాదం అందజేశారు.

# వనపర్తి జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

### రానున్న 24 గంటల్లో వనపర్తి జిల్లాలో భారీగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక..!!!

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి..!!!



వాయిస్ టుడే వనపర్తి జిల్లా : బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి తూఫానుగా మారి నందున వనపర్తి జిల్లాలో రానున్న 48 గంటల్లో భారీగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలోఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరుగకుండా అధికా రులు,సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలి.రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలక్టర్ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందస్తు చర్యల పై వివిధ శాఖల అధి కారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అధికారులు, పంచాయతీ సెక్రటరీలు స్థాని కంగా ఉండాలని ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవా లని సూచించారు.చెరువులు కుంటలు తెగిపోవడానికి అవకాశం ఉందనే అంచనా ఉన్న వాటిని గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. రోడ్లు, కల్వర్టుల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఒకవేళ తెగిపోయిన, కల్వర్టులు ఓవర్ ఫ్లో అయిన వెంటనే అటువైపు ఎవరు వెళ్లకుండా బారికెడ్ ఏర్పాటు చేసి సిబ్బందిని ఉంచాలని ఆదేశించారు. శిధిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి కుటుంబా లను వెంటనే ఖాళి చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించా లని ఆదేశించారు. మత్స్య కారులు మత్స్య వేటకు వెళ్ల వద్దని అదేవిధంగా పశువులను మేతకు ఇడవవద్దని ప్రజలను కోరారు. ముఖ్యంగా కృష్ణ నది పరివాహక గ్రామాలు చింతరెడ్డి పల్లి, ఇర్లదిన్నె, నందిమల్ల, కిష్టంపల్లి, మూలమల్ల, జూరాల,గుంటిపల్లి, మోట్లంపల్లి, కత్తే పల్లి, ఆరేపల్లి, రేచింతల, వైశాగాపూర్, రామమ్మపేట, రంగాపూర్, రాంపూర్, జనుంపల్లి, మునగామాన్ దీన్నే, పెంచికల పాడు, బుర్దిపాడ్, గుమ్మడం, యాపర్ల, గడ్డ బస్వాపురం, పెద్దమారు,చిన్నమారు, బెక్కెం, వెల్తురు, సోలిపూర్, కాలూరు, చెన్నేపాడు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తుఫాను వల్ల ఏదైనా సమస్యలు వస్తె కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. తూఫాన్ కంట్రోల్ రూమ్ నెం.08545-233525, 08545-220351. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, ఆర్డీఓ పద్మావతి, జడ్పి సి. ఈ. ఒ యాదయ్య, పి.డి. డి ఆర్ డి ఓ ఉమాదేవి, ఇరిగేషన్ ఈ.ఈ మధుసూదన్ రావు, పంచాయతీ రాజ్ ఈ. ఈ మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, డియల్పీఓ రఘునాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలి

### ఎంపీ పరందేశ్వరికి వినతి పత్రం అందజేసిన రజక సంఘం అధ్యక్షులు చాటపర్తి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 31 (వాయిస్ టుడే) రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షులు చాటపర్తి పోసి బాబు ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంపీకి వినతి పత్రం అందజేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆశయమైన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై కృషి చేయాలని పోసి బాబు విజ్ఞప్తి చేశారు. విజయవాడ లో జరిగిన పరిచయ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షులు చాట పర్తి పోసి బాబు పై అంశాన్ని ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు మరియు పార్లమెంట్ సభ్యులు శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు తన తండ్రి ఆశయమైన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విషయమై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్,రజక సంఘం సీనియర్ నాయకులు పసుపులేటి మహాలక్ష్మణ రావు, కేతిగుంట్ల సుబ్బరాయుడు, ఈగలపాటి యువశ్రీ, వేముల మహేష్, నూజేటి నాని, నాగ శివ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఆగస్టు 31 ) వాతావరణ శాఖ సమాచారం ప్రకారం 31-08-24 శనివారం నుండి బుధవారం04- 09 -24 వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పట్టణ పంచాయతీ గ్రామ పరిధి లోని. ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, సుదూర ప్రాంత ప్రయాణాలు చేయరాదని, ప్రజలు ప్రయాణించే మార్గంలో వాగులు వంకలు దాటరాదని, గ్రామీణ ప్రాంతంలోని మట్టి గోడల ఇల్లు, పాకలలో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లా అధికారులందరూ సమైక్యంగా పనిచేసే ఎటువంటి నష్టం కలగకుండా తమ వంతు బాధ్యతలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ఏఆర్.హెడ్ కానిస్టేబుల్ రాములు కుటుంబానికి సిబ్బంది చేయూత

### రూ. 1.40 లక్షలు అంజేసిన ఏ ఆర్ సహోద్యోగులు



సూర్యాపేట, ఆగస్టు 31(వాయిస్ టుడే ప్రతినిధి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సూర్యపేట ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జలగం రాములు కుటుంబానికి సూర్యపేట జిల్లా కేంద్రంలోని ఎస్పికార్యాలయ ఏ .ఆర్ .పోలీస్ సిబ్బంది అండగా నిలిచారు. శనివారం ఆయన దశదిన కర్మ సందర్బంగా ఏఆర్ పోలీసు సన్నిహితులు తమ దాతృత్వం చాటుకుని ఒక లక్ష 40 వేల రూపాయలు రాములు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్బంగా రాములు కుటుంబానికి చేయూతలో బాగస్వాములైన సూర్యపేట ఏఆర్ పోలీస్ సిబ్బందికి వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




## నటరాజ డ్యాన్స్ అకాడమీ చిన్నారుల నాట్య ప్రభంజనం

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి ఆగస్టు 31 2024 (వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్రం ఆగస్టు 30న హైదరాబాద్ లోని స్వర్ణగిరి దేవస్థానమందు భద్రాద్రి సాంస్కృతిక వారధి ఆధ్వర్యంలో జరిగిన స్వర్ణగిరి నృత్యోత్సవాల్లో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో నాట్య ప్రభంజనం సృష్టించారు.ఈ కార్యక్రమం లో భాగంగా శ్రీనికా రాజ్, రష్మిక, అక్షయని, ఆద్య, శ్రీనిక, శ్రీ సహస్ర, అశ్విని, సాన్విక, అభిజ్ఞ, సహస్ర అను చిన్నారుల ప్రదర్శనకు గాను చిన్నారులను శ్రీవెంకటేశ్వరస్వామి అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ చిన్నారులను టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమండ్ల మధు, మంచిర్యాల జిల్లా నృత్య కళా సమాఖ్య అధ్యక్షులు రాకం సంతోష్, నాట్యగురువు పి.అర్చన జయప్రకాష్, తల్లిదండ్రులు అభినందించారు.

## యాదగిరిగుట్టలో మన్సూన్ ప్రిపేర్ ఎమర్జెన్సీ స్పెషల్ టీమ్స్ ప్రజలకు అందుబాటులో..

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట:3 రోజులపాటు వర్షాలను దృష్టిలో పెట్టుకొని వాతావరణ శాఖ వారి సూచించారు. యాదగిరిగుట్ట మున్సిపల్ పురపాలక సంఘం కార్యాలయంలో చైర్మన్ సుధాహేమెంధర్ గౌడ్, కమిషనర్ అజయ్ కుమార్ అధికారులు అత్యవసర సమావేశం నిర్వహించారు. మన్సూన్ ప్రిపేర్ ఎమర్జెన్సీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని మన్సూన్ ప్రిపేర్ ఎమర్జెన్సీ స్పెషల్ టీమ్స్ ఏర్పాటుచేశారు. గత రాత్రి నుండి కురుస్తున్న అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని వాతావరణ శాఖ వారి సూచనల మేరకు ఇంకా 72 గంటలు అంటే 3రోజులు వర్షాలు వున్నాయని తెలపడం జరిగింది కావున పట్టణ ప్రజలు వర్షాల వల్ల ఇబ్బందులు పడకూడదని ఎవరికైనా ఇబ్బంది ఉన్నవాళ్లు అంటే వరద నీరు ఇళ్లలోకి రావడం లేదా కాలనీ రోడ్డు అంతా కూడా నీటితో మునిగిపోవడం ఎవరిదైనా పాత ఇల్లు ఉంటే ప్రమాదం సంభవించి ఇల్లు కూలడం అటువంటి సంఘటనలు సంభవించినపుడు ఈ యొక్క క్రింద తెలిపిన మన్సూన్ ప్రిపేర్ ఎమర్జెన్సీ స్పెషల్ టీమ్స్ సభ్యులు (ఎమర్జెన్సీ) నంబర్స్ కి ఫోన్ చేయగలరు మీరు ఎమర్జెన్సీగా ఫోన్ చేయవలసిన ఫోన్ నంబర్స్... శానిటేషన్ SI కిరణ్ బాబు



9182601092 ఫోన్ చేయగలరు శానిటేషన్ జవాన్ బూడిద కుమార్ 8977538819, Ch. రాజు 9989906528, ఇటుకల గణేష్ 6302916839, హరిబాబు 9000690473, ఈశ్వర్ 9573541621' దిలీప్ 9542143648,, వెంకటేష్ 9603849012,, కు కూడా ఫోన్ చెయ్యగలరు. ఎమర్జెన్సీ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ యాదగిరిగుట్ట AE సురేందర్ నాయుడు 9440813589, మున్సిపల్ స్ట్రీట్ లైట్స్ యొక్క కరంటు వైర్లు ఊడిపోవడం లాంటి ఇబ్బంది ఉన్నవాళ్లు. లైటింగ్ సిబ్బంది. సభ్యన్ మల్లేష్ 9989085400 ,తాటీకొండబాలరాజు 9951066799, గడ్డమిది మధు9550171090, బూడిద రాజేష్ 8977538819,, ఫోన్ చెయ్యగలరు. వాటర్ సెక్షన్ నుండి బూడిద అంబేత్కర్ 7799186411 ఆవుల మహేష్ 9676890138,, పట్టణ ప్రజలు ఇ అకాల వర్షానికి జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ పాలకవర్గం తెలియజేశారు.

# నేటి నుండి కాజీపేట బియాబాని దర్గా ఉత్సవాలు

**మూడు రోజులు ఉత్సవాలు.. భారీగా తరలివస్తున్న భక్తులు**

**తరలిరానున్న ప్రజాప్రతినిధులు.. ఏర్పాట్లు పూర్తి**

**నేటి రాత్రి అంగరం వైభవంగా జరుగనున్న సందల్**

**భక్తుల ఆకలి తీర్చడానికి భారీ పాత్ర చేయించిన దర్గా యాజమాన్యం**

**ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ స్థలాల ఏర్పాట్లు**

**దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా**




వాయిస్ టుడే, వరంగల్ జిల్లా: ప్రతీ సంవత్సరం జరిగే అంగరంగవైభవంగా జరిగే కాజీపేట బియాబాని దర్గా ఉత్సవాలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. ఈ సంవత్సరం ఉత్సవాలను గత సంవత్సరం కంటే ఘనంగా నిర్వహించనున్నట్లు కాజీపేట బియాబాని దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా తెలిపారు. శనివారం దర్గా ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పీఠాధిపతి ఖుస్రూ పాషా మాట్లాడుతూ దర్గా ఉత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని ఆయన అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా దూరప్రాంతం నుండి భక్తులు వచ్చారని తెలిపారు. గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక లాంటి రాష్ట్రాల నుండి భక్తులు వచ్చి ఉన్నారని అన్నారు. దర్గా ఉత్సవాలు జరిగే మూడు రోజులపాటు వారు ఇక్కడ ఉండేవిధంగా వారికోసం ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సంవత్సరం జరిగే ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ హాజరవుతారని.. ఆయనతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొంటారని చెప్పారు. సమయాభావం బట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు.

ఉత్సవాల్లో భాగంగా నేటి రాత్రి సందల్ నిర్వహిస్తామని తెలిపారు. దర్గా లోని తమ పూర్వీకుల ఇళ్లు బడాఘర్ నుండి సందల్ తీసుకువస్తామని, అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ ఊరేగింపు ఉంటుందని.. ఈ కార్యక్రమంలో వేలసంఖ్యలో భక్తులు పాల్గొంటారని ఖుస్రుపాషా తెలిపారు. అర్ధరాత్రి వరకు సాగే ఈ ఊరేగింపు అనంతరం సందల్ ను దర్గా లోకి తీసుకువెళ్లి దైవసమానులైన తమ పూర్వీకుల సమాధులను తాపనం చేస్తామన్నారు. దాంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని అన్నారు. మూడురోజులు సాగే ఈ ఉత్సవాల్లో భక్తుల ఆకలి తీర్చడానికి భారీ పాత్రను తయారుచేశారు. ఒకేసారి 7500మందికి అన్నం వండేవిధంగా ఈ పాత్రను తయారుచేయించామని ఖుస్రుపాషా తెలిపారు. గత సంవత్సరం ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుంటున్నామని.. అలాగే జేబుదొంగ ల ప్రమాదం భారినపడకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. ఉత్సవాలకోసం వచ్చే భక్తుల వాహనాలకోసం నాలుగుచోట్ల పార్కింగ్ స్థలాలు ఏర్పాటుచేసామని తెలిపారు. సెయింట్ గాబ్రిల్ హై స్కూల్, కాజీపేట దర్గా ప్రభుత్వ పాఠశాల, దర్గా వెనక ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా వచ్చి ఉత్సవాల్లో పాల్గొని దేవుడి ఆశీస్సులు స్వీకరించి తిరిగి జాగ్రత్తగా తమ గమ్యస్థానాలకు చేరాలని భక్తులకు విజ్ఞప్తిచేశారు. భక్తులకు ఏదైనా అనారోగ్యం తలెత్తితే వారికి అత్యవసర చికిత్స అందించడంకోసం ప్రభుత్వం తరుపున ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుచేసినట్టు దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషావ తెలియజేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, బబ్లు, కుమార్, షాకీర్, కాజీపేట సిఐ సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ లు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పనుల సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలి

**ప్రభుత్వ సర్వేయర్లతో సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

ప్రభుత్వ పనులకు సంబంధించిన సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్లో ప్రభుత్వ సర్వేయర్లతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఇటీవల బదిలీ పై జిల్లాకు వచ్చిన సర్వేయర్లు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఉద్యోగులు అందరూ స్థానికంగానే ఉండాలని సూచించారు. ప్రభుత్వానికి చెందిన సర్వే పనులు వేగంగా పూర్తి చేయాలని, పెండింగ్ లో పెట్టవద్దని ఆదేశించారు. రైతులు, ఇతర వ్యక్తుల దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించా లని, ఇంచార్జీ బాధ్యతలు ఉన్న వారు అక్కడ మూడు రోజులు, ఇక్కడ జిల్లాలో మూడు రోజులు విధులు నిర్వర్తించాలని వివరించారు. సర్వేయర్ల పనితీరు పై వారం, నెల వారీ నివేదికలు ఇవ్వాలని ఏడీ సర్వే వినయ్ కుమార్ ను అదనపు కలెక్టర్ సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ డీఐ లు బాలచందర్, రత్నం, ఆయా మండలాల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ సంకే పల్లి శివప్రసాద్ లక్ష్మి పదవి విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ముందుగా పదవి విరమణ పొందిన సంకే పల్లి శివప్రసాద్ లక్ష్మి గార్లకి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్ప నైనది అని శివ ప్రసాద్ వివిధ పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని నిర్వహించి ఎంతోమంది విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించారని ఉద్యోగరీత్యా పదవి విరమణ అందరికీ తప్పనిసరి అని పదవి విరమణ వారి ఉద్యోగానికి కానీ వారి సేవలకు కాదని పదవి విరమణ అనంతరం వారి బావి జీవితం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ రాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు వీరిపై ఎల్లప్పుడూ ఉండాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేములవాడ పట్టణం లోని మహాలక్ష్మి వీధిలో కోరేపు కుమార్,నూతన గృహప్రవేశ వేడుకల్లో గౌరవ కౌన్సిలర్లతో కలిసి పాల్గొనడం జరిగింది.

## ఏ మొహం పెట్టుకొని ప్రజల్లోకి వస్తావు

**కేసీఆర్‌కు డిప్యూటీ సీఎం సూటి ప్రశ్న**



పెద్దపల్లి జిల్లా: ఆగస్టు. 31 (వాయిస్ టుడే) గోదావరిఖని: చౌరస్తాలో జరిగిన బహిరంగ సభకు వచ్చిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ను ఘనంగా గజమాలతో స్వాగతం పలికారు ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాలు అధికారంలో ఉండి తెలంగాణను దోపిడీ చేసి నువ్వు నీ కొడుకు విదేశాల్లో డబ్బులు దాచుకొని రైతులకు ఒక లక్ష రూపాయలు రుణమాఫీ చేయని నువ్వు ఏ మొహం పెట్టుకొని ప్రజల్లోకి వస్తావని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క కేసీఆర్ ను ప్రశ్నించారు తాము ఇప్పటివరకు రెండు లక్షల రుణమాఫీ 60వేల ఉద్యోగాలు ఇచ్చాం మరో 60 వేల ఉద్యోగాలకు పరీక్షలు జరగనున్నాయని తెలంగాణలో సంపదను సృష్టించి ప్రజలకు పంచడమే మా లక్ష్యం అని ఆయన అన్నారు విద్యార్థులు పోటీ పరీక్షలకు చదువుకోవడానికి ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను ప్రారంభించబోతున్నామని విద్య కోసం ఐదు వేల కోట్ల రూపాయలు కేటాయించామన్నారు ఎమ్మెల్యే మక్కాన్సింగ్ కోరిన విధంగా పాలకుర్తి లిఫ్ట్ రిజర్వాయర్ 800 మెగావాట్ల పవర్ ప్రాజెక్టు అనుమతి చేస్తూ సింగరేణిలో, ఇరిగేషన్ క్రింద భూములు కోల్పోయిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కాంట్రాక్టు కార్మికుల 22 జీవోను అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు గ్రూప్ మహిళలకు 23 కోట్ల చెక్కును విడుదల చేసి మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తామన్నారు బి ఆర్ఎస్ పాలనలో తెలంగాణ సింగరేణి దోపిడీకి గురయ్యాయని తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత సింగరేణిలో ఉద్యోగాలు సృష్టించామని తాను సింగరేణి కార్మికులకు ఎప్పుడూ అండగా ఉంటామని అన్నారు బహిరంగ సభ విజయవంతం కావడంతో ఎమ్మెల్యే మక్కాన్సింగ్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు పాల్గొన్నవారు. రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు దుద్దెల శ్రీధర్ బాబు, పెద్దపల్లి నియోజకవర్గ పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ,ప్రభుత్వ విప్ అట్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్ద పెల్లి, చెన్నూర్, బెల్లంపల్లి, ఎమ్మెల్సీ,ఇతర నాయకులు రామగుండం శాసన సభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం




వేములవాడ మున్సిపల్ సాధారణ సమావేశంలో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు మాట్లాడుతూ ఎజెండాలో పొందుపరిచిన 42 అంశాలను మరియు టేబుల్ ఏజెండా 6 అంశాలను పాలకవర్గ సభ్యులు మరియు కోఆప్షన్ సభ్యులతో చర్చించి అన్ని అంశాలను ఆమోదం చేయనైనది అని మున్సిపల్ చైర్ పర్సన్ తెలియజేశారు. వచ్చే నెలలో వినాయక చవితి వినాయక నిమజ్జనం ఉన్నందున చెరువు కట్ట పైన మున్సిపల్ తరఫున చేయవలసిన నిమజ్జనం ఏర్పాట్లపై చర్చించారు వాతావరణ పరిస్థితులు మారుతున్నందున డెంగ్యూ మరియు ఇతర సీజనల్ వ్యాధులు ప్రభలించే అవకాశం ఉన్నందున వార్డులలో ఫాగింగ్ మరియు యాంటీ లార్వా స్ప్రే చేయాలి అని రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లించాలి అని కమిషనర్ ని సానిటరీ ఇన్స్పెక్టర్ ని చైర్ పర్సన్ ఆదేశించారు. మరియు వివిధ వార్డులలో పట్టణంలో చేయవలసిన పలు అభివృద్ధి పనులపై సానిటేషన్ పరంగా చేయవలసిన పనులపై గౌరపాలకవర్గ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన మేనేజర్ సంపత్ రెడ్డి కి గౌరవ పాలకవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ కమిషనర్ సంపత్ రెడ్డి, వైస్ చైర్మన్ బింగి మహేష్, గౌరవ పాలకవర్గ సభ్యులు మరియు కోఆప్షన్ సభ్యులు, %ణజు% తిరుపతి, %ూజు% నర్మద %ూూ% అన్సర్, సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ ప్రధానాచార్యుల ఉద్యోగ విరమణ

**బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైభవంగా నిర్వహణ**

**తరలివచ్చిన జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి ఆగస్టు 31 2024 (వాయిస్ టుడే) : బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు, ప్రస్తుత కెమిస్ట్రీ అధ్యాపకులు ఎం. గోపాల్ డిగ్రీ వ్యవస్థలోనే ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారని ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అన్నారు. ప్రిన్సిపాల్ శంకర్ అధ్యక్షతన కళాశాల ఆవరణలో ఏం గోపాల్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల, లక్షెట్టిపేట, చెన్నూరు, ఆసిఫాబాద్, కాగజ్నగర్, గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్లు హాజరయ్యారు.

**గోపాల్ సేవలు మరువలేనివి**

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల దశ దిశను మార్చిన ఘనత గోపాల్ కు దక్కుతుందని అన్నారు. ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో దాదాపు ప్రతి డిగ్రీ కళాశాలలో పనిచేసిన గోపాల్ మనందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన సేవలు మా అందరికీ గుర్తు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్, జిల్లాలోని ఇతర డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లు డాక్టర్ వి చక్రపాణి, పట్వర్ధన్, సంతోష్, కనకయ్య, శ్రీదేవి, జై కిషన్ ఓజా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## అన్నమ్మ జ్ఞాపకార్థకూడికలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మాడ్గులపల్లి ఆగస్టు 31 (వాయిస్ టుడే): మండలంలోనిఆగామోత్కూర్ గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్ క్రీ.శే.కోరే భాస్కర్ మాతృమూర్తి కోరే అన్నమ్మ ఇటీవల మృతి చెందడం జరిగింది. శనివారంఆగామోత్కూర్ గ్రామంలోనిర్వహిం చిన కోరే అన్నమ్మ జ్ఞాపకార్థ కూడికలో మండల పార్టీ అధ్యక్షులు గడ్డం వేణుగోపాల్ రెడ్డి,పిసిసి ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య లు పాల్గొని కోరే అన్నమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీఅండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ టెక్నికల్ సెల్ కార్యదర్శి మల్లె లింగారెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీకార్యనిర్వాహక అధ్యక్షులు పుల్లెంల నరసింహ, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బొప్పని నగేష్, చింతమల్ల విజయ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.



## మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

**చీర్లవంచలో నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

మిడ్ మానేర్ ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. మిడ్ మానేర్ ముంపు గ్రామాలు ఆరేపల్లి, సంకేపల్లి, రుద్రవరం, కొడుముంజ, అనుపురం, శభాష్ పల్లి, చింతల్ ఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులతో చీర్లవంచలో శనివారం సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ఇండ్లకు పరిహారం, పట్టాలు, 18 ఏండ్లు నిండిన వారికి పరిహారం, ఆలయాలకు పరిహారం రాలేదని ఇతర సమస్యలను ప్రభుత్వ విప్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామాలకు సరిహద్దులు చూపాలని, ఆక్రమణలు నిరోధించాలని, స్మశాన వాటికల వద్ద సమస్యలను పరిష్కరించాలని, పలువురు రియల్ ఎస్టేట్ నిర్వాహకులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ముంపు గ్రామాల పరిధిలో వెలసిన రియల్ ఎస్టేట్ వెంచర్ లకు అనుమతులు ఉన్నాయా? డీటీసీపీ అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలని, ప్రభుత్వ భూములపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. మానవతా దృక్పథంతో అందరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ పరిహారం, మిగితా బెనిఫిట్స్ వచ్చేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. నోటిఫైడ్ కానీ వారి దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయిస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఎస్డీసీ రాధాబాయ్, డీఆర్డీఓ శేషాద్రి, వేములవాడ అర్బన్ తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కాపువాడ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ

### ఎంపీ లాడ్స్ నిధుల నుండి రూ.15 లక్షలు మంజూరు చేసిన బండి సంజయ్

కరీంనగర్ ఆగస్టు 31(వాయిస్ టుడే)కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ లో ఈరోజు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కరీంనగర్ పట్టణంలోని 29వ డివిజన్ కాపువాడలో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాలు భవన నిర్మాణ పనులకు బండి సంజయ్ భూమి పూజ చేశారు. ఈ భవన నిర్మాణానికి రూ.15 లక్షల ఎంపీ లాడ్స్ నిధులను బండి సంజయ్ మంజూరు చేశారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, కరీంనగర్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్ తోపాటు మున్నూరుకాపు సంఘానికి చెందిన పలువురు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు కరీంనగర్ 13వ డివిజన్ లోని పెద్దమ్మ కాలనీలో రూ.10 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మించనున్న వడ్డెర కమ్యూనిటీ హాలు, హస్నాపూర్ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.



## కూలిన ఆలయ పైకప్పును పరిశీలించిన డిప్యూటీ మేయర్

కరీంనగర్ ఆగస్టు 31(వాయిస్ టుడే)కరీంనగర్ పట్టణం 49 వ డివిజన్ లోని స్థానిక భారత్ టాకీస్ చౌరస్తాలో గల 150 సంవత్సరాల పురాతన పాండురంగ దేవాలయం శిథిలావస్థకు చేరగా రాత్రి కురిసిన వర్షానికి స్లాబ్ పై కప్పు, గోడలు విరిగిపడినాయి. సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ సర్దార్ కమల్జిత్ కౌర్ సోహన్ సింగ్ గార్లతో కలిసి పాండురంగ స్వామి దేవాలయాన్ని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరి శంకర్ లు పరిశీలించారు. ఏళ్ల నాటి కట్టడం కావడంతో శిథిలావస్థకు చేరడంతో కులిపోవడం జరిగిందని స్థానికులు తెలపగా ఆలయంలోకి ప్రస్తుతం ఎవరు కూడా వెళ్లవద్దని సూచించారు. మున్సిపల్ సిబ్బందికి శిధిలాలను తొలగించాలని ఆదేశించారు. ఈ సంధర్బంగా ఆలయ పండితులు, భూ యజమానితో మాట్లాడి ఆలయ పునర్నిర్మాణం చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందించి త్వరలో నూతన నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.




## వికాస్ హై స్కూల్‌లో ఎలక్షన్స్

కరీంనగర్ ఆగస్టు 31(వాయిస్ టుడే)కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఆసిఫ్ నగర్ లో ఉన్న వికాస్ హై స్కూల్ లో విద్యార్థులకు ఎలక్షన్స్ నిర్వహించారు. విద్యార్థులకు దశ నుండే నాయకత్వ లక్షణాలు అలవర్చడం కోసం పాఠశాలలో స్కూల్ బోర్డ్ ఎలక్షన్స్ నిర్వహించడం జరిగింది అని ప్రధానోపాధ్యాయురాలు రాచమల్ల శారద -శ్రీనివాస్ తెలిపారు. ఎలక్షన్ లో గెలుపొందిన విజేతలను బ్యాడ్జులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేత్రదాత నాగమ్మకు నివాళులర్పించి.. అభినందన పత్రం

పెద్దపల్లి జిల్లా: ఆగస్టు. 31 ( వాయిస్ టుడే) గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆర్జీ-1లోని 11ఏ గనిలో అసిస్టెంట్ మేనేజర్ గా పని చేస్తున్న వగ్గం లక్ష్మీనారాయణ-లక్ష్మీ అధికారి, తల్లి నాగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐ బ్యాంక్ కు దానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం గోదావరిఖని విఠల్ నగర్ లోని వారి నివాసంలో నేత్రదాత సంస్మరణ సభను నిర్వహించారు. ముందుగా నేత్రదాతకు నివాళులర్పించి, నేత్రదాత కొడుకులు, కూడళ్ళ లక్ష్మీనారాయణ-లక్ష్మీ, శ్రీనివాస్-ఉషాశ్రీకి అభినందన పత్రాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన సీఎంఓఏ రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం నేత్ర, అవయవ, దేహదానంపై అవగాహన కల్పించారు. నేత్రదాత కుటుంబాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.మల్లికార్జున్, సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు వాసు, రఘుపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.




# అందరికీ ఈ దంపతులు ఆదర్శం

పెద్దపల్లి జిల్లా: ఆగస్టు 31 (వాయిస్ టుడే) గోదావరిఖని: ఎన్టీపీసీ ఇంజనీర్ దంపతుల ఉద్యోగ విరమణ సందర్భంగా అంగీకారం కొడుకు, కోడలును చూసి,దేహ దానానికి ముందుకు వచ్చిన వృద్ధ తల్లిదండ్రులు .. సత్కరించిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు. అభినందించిన ప్రముఖ రచయితలు నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్.. వైద్య విద్యార్థుల పరిశోధన కోసం... తమ మరణానంతరం మెడికల్ కాలేజీకి తమ దేహాలను దానం చేస్తామని రామగుండం ఎన్టీపీసీ సంస్థలో ఎస్ ఎల్ పీ ఎస్ ఇంజనీర్ జీగురు అయిలయ్య-అరుణాదేవి దంపతులు ప్రకటించారు. కొడుకు, కోడలు తీసుకున్న నిర్ణయాన్ని గౌరవించిన అయిలయ్య వృద్ధ తల్లిదండ్రులు ఓదెలు-కనకలక్ష్మీ కూడా తమ మరణానంతరం నేత్ర, అవయవ, దేహదానం చేస్తామని ప్రకటించారు. ఈ రెండు జంటలు తీసుకున్న ఆదర్శనీయమైన నిర్ణయం అందరికీ స్ఫూర్తినిచ్చింది. అందర్నీ అబ్బురపరిచిన ఈ సంఘటన పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఓదెల మండలం కొలనూరుకు చెందిన జీగురు ఓదెలు-కనకలక్ష్మీ దంపతులకు నాగయ్య, అయిలయ్య, రవీందర్, రాంచందర్ నలుగురు కొడుకులతోపాటు కూతురు లక్ష్మీ సంతానం. వీరిలో రెండవ కుమారుడు అయిలయ్య రామగుండం ఎన్టీపీసీ సంస్థలో ఎస్ ఎల్ పీ ఎస్ ఇంజనీర్ గా పని చేస్తున్నారు. గత 36 ఏళ్లుగా విశిష్ట సేవలందించిన అయిలయ్య శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ



సందర్భంగా ఎన్టీపీసీ టౌన్ షిప్ లో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తమ మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానం చేస్తామని జీగురు అయిలయ్య-అరుణాదేవి దంపతులు ప్రకటించారు. ఉద్యోగ విరమణ సందర్భంగా దంపతులు తీసుకున్న నిర్ణయాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి, ముఖ్య సలహాదారులు నూక రమేష్, ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్ అభినందించి, దంపతులకు అభినందన పత్రం అందజేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం నేత్ర, అవయవ శరీర దానాలపై అవగాహన కల్పించారు. ఇదంతా గమనించిన అయిలయ్య వృద్ధ తల్లిదండ్రులు జీగురు ఓదెలు-కనకలక్ష్మీ కూడా అప్పటికప్పుడు తమ మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానం చేస్తామని ప్రకటించారు. దీనితో ఇదే వేదికపై ఓదెలు-కనకలక్ష్మీ తల్లిదండ్రులకు అయిలయ్య దంపతులు పాదాభివందనం చేశారు. కొడుకు, కోడలును ఆదర్శంగా తీసుకుని, వృద్ధ తల్లిదండ్రులు కూడా శరీర దానం చేయడానికి ముందుకు వచ్చిన తీరు... నేటి దంపతులకు, సమాజానికి చక్కటి స్ఫూర్తి సందేశం ఇచ్చారని, ఉద్యోగ విరమణ సందర్భంగా అయిలయ్య-అరుణాదేవి దంపతులు కూడా తీసుకున్న నిర్ణయం అభినందనీయమని ప్రముఖ కవి, రచయిత, పరిశోధకుడు, బహుభాషావేత్త కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమేల భాస్కర్, ప్రముఖ కవి, రచయిత అన్నవరం దేవేందర్ తదితరులు కొనియాడారు. సదాశయ ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఇదే వేదికపై వృద్ధ దంపతులను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు పూలమాలలు, శాలువలతో సత్కరించారు. పలువురికి ఆదర్శంగా నిలిచిన రెండు జంటల ఆదర్శ దంపతులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రావణ్ కుమార్ అభినందించారు.



## ఎస్ఓఎఫ్ క్రీడల్లో సత్తా చాటిన ఐపీఎస్ పాఠశాల విద్యార్థులు

సుల్తానాబాద్,పెద్దపెల్లి జిల్లా ఆగస్టు31(వాయిస్ టుడే): మండల కేంద్రంలోని సెయింట్ మేరీ పాఠశాలలో గత మూడు రోజులపాటు జరిగిన మండల స్థాయి క్రీడల్లో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చి సత్తా చాటారు.సుల్తానాబాద్ మండల ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో పదిహేడు సంవత్సరాల బాలికలకు మొదటి బహుమతి, పధ్నాలుగు సంవత్సరాల బాలికలు మొదటి బహుమతి, ఖో ఖో పదిహేడు సంవత్సరాల బాలికలు మొదటి బహుమతి సాధించగా, వాలీబాల్ పోటీలలో పధ్నాలుగు సంవత్సరాల బాలికలు రెండో బహుమతి,పధ్నాలుగు సంవత్సరాల బాలురు రెండో బహుమతి సాధించారు.వీరిని పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణ ప్రియా విద్యార్థులను అభినందించారు.వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలలో ఆసక్తి కనబరిచి రాణించాలని కోరారు. క్రీడల వల్ల శరీరానికి కావలసిన వ్యాయామం, ఆరోగ్యం, దృఢంగా ఏర్పడుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ, సతీష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి చట్టాలపై అవగాహన పెంచుకోవాలి - జడ్జి దుర్గం గణేష్

సుల్తానాబాద్,పెద్దపెల్లి జిల్లా ఆగస్టు31(వాయిస్ టుడే): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. శనివారం మండల న్యాయ సేవాదికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ న్యాయ సహాయం అందించడానికి మండల న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తుందని, న్యాయ సహాయం పొందాలనుకునే వారు సుల్తానాబాద్ కోర్టు నందు లీగల్ సర్వీసెస్ సెల్ ను సంప్రదించవచ్చని అన్నారు. ప్రతి విద్యార్థిని పాజిటివ్ దృక్పథంతో ఆలోచించి శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలాగే పలువురు న్యాయవాదులు వివిధ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల భోజనశాలను పరిశీలించి బోజన ఏర్పాట్లు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని స్పెషల్ ఆఫీసర్ స్వప్న కు సూచించారు. విద్యార్థి జడ్జి గణేష్ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసి పెన్నులను బహుమతిగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్పెషల్ ఆఫేసర్ స్వప్న, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్, ఎజీపి ఆవుల లక్ష్మి రాజం, న్యాయవాదులు ఆకారపు సరోత్తం రెడ్డి, అవునూరి సత్యనారాయణ, నేరెళ్ల శంకరయ్య, బోయినీ భూమయ్య, వేపూరి తిరుపతి, సామల రాజేంద్రప్రసాద్, రుద్రారపు నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు..

## జ్ఞాపకశక్తి, రోగ నిరోధక శక్తిని పెంపొందించే ఔషధం పంపిణీ



సుల్తానాబాద్,పెద్దపల్లి జిల్లా ఆగస్టు31(వాయిస్ టుడే) జ్ఞాపక శక్తిని,రోగ నిరోధక శక్తిని మేధాశక్తిని, పెంపొందించే ఆయుర్వేద ఔషధాన్ని వికాస తరంగిణి ఆధ్వర్యం లో శనివారం పంపిణీ చేశారు.స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఔషధ పంపిణీ కార్యక్రమాన్ని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు ప్రారంభించారు.. చిన్న జీయర్ ఆశ్రమంలోని భవ ఆయుర్వేదకేంద్ర ఆసుపత్రి నుంచి తయారు చేయబడిన ఈ ఔషధం జీరో వయస్సు నుంచి పదహారు ఏళ్ల వయసు గల పిల్లలకు పంపిణి చేశారు. పరిగడుపున పిల్లలకు ఈ ఔషధం వేయించడం వలన రోగ నిరోధక శక్తి, జ్ఞాపకశక్తి, మేధాశక్తి పెంపొందించబడుతుందని, ఆలోచనలు మెరుగుపరుస్తాయని, అలాగే మాటలు సక్రమంగా రాని వారికి సహాయపడుతుందని వికాస తరంగిణి చీఫ్ కో ఆర్డినేటర్ సాదుల సుగుణాకర్ తెలిపారు.అలాగే ఆటిజం నుంచి కాపాడుతుందని, జీర్ణక్రియను పెంపొందిస్తుందని వివరించారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం ఉన్న రోజున ఈ మందును సేవించాలని పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం ఇరవై ఒకటి నెలల పాటు ఈ ఔషధాన్ని ఇవ్వాలని సూచించారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం ఉన్న రోజున స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ ఔషధాన్ని పంపిణీ చేయడం జరుగుతుందని చిన్న జీయర్ స్వామి మంగళాశాసనముల తో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. నాలుగు రోజుల క్రితం భవ ఆయుర్వేద కేంద్రం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం సదస్సు హైదరాబాదులోని ముచింతల్ ఆయుర్వేద ఆసుపత్రి ఆవరణలో నిర్వహించగా అక్కడికి వచ్చిన చాలామంది ఈ ఔషధం వినియోగించడం వల్ల కలిగిన ప్రయోజనాలను వివరించారు.ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ పోదిల్ల రమేష్, గొట్టం రమేష్,అల్లాడి భగవాన్, పల్లా మహేందర్, పారువెళ్ల రమేష్ శర్మ బత్తిని నరేష్ ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో గంజాయి పట్టివేత - ఎక్సైజ్ సి ఐ మాధవీలత



జమ్మికుంట ఆగస్టు 31 (వాయిస్ టుడే): జమ్మికుంట పట్టణంలోని స్థానిక రైల్వే స్టేషన్ పరిధి కొత్తపల్లి లో ఎక్సైజ్ అధికారులు చేసిన దాడిలో ఎండి షమీం అనే మహిళ వద్ద 490 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సదురు మహిళను ఎక్సైజ్ అధికారులు వివరణ కోరగా ఇట్టి గంజాయిని జమ్మికుంట లో ఎవరికి అమ్ముటలేదని మహారాష్ట్ర బల్లార్షాలకు ఎగుమతి చేసుటకు తనకు కూలీ డబ్బులు ఇస్తారని సమాధానం చెప్పినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇట్టి మహిళను అదుపులోకి తీసుకొని జమ్మికుంట మండల తహసీల్దారు ముందు హాజరు పరిచి గంజాయిని స్వాధీనం చేసుకొని ఎండి షమీంపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు, ఈ దాడులలో ఎక్సైజ్ సీఐ ఎం మాధవి లత, ఎస్సై ఎం సౌమ్య, హెడ్ కానిస్టేబుల్ ఎస్ ఐలయ్య, పెద్దన్న, భాస్కర్, మహేష్, పద్మావతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు

సుల్తానాబాద్,పెద్దపల్లి జిల్లా ఆగస్టు31(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. శనివారం పెద్దపల్లి జిల్లా రామగుండంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల కు వెళుతున్న సందర్భంగా ఉప ముఖ్యమంత్రిని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్థానిక తెలంగాణ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద ఘన స్వాగతం పలికారు.పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకొని బట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ లకు పుష్పగుచ్చాలు, గజమాలలు వేసి స్వాగతం పలికిన అనంతరం శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కాన్వాయ్ రామగుండం వైపు సాగిపోయింది.



# పదవి విరమణ పొందిన ఉద్యోగులు సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి

**ఉత్తమ సేవలతోనే ప్రతి ఉద్యోగికి గుర్తింపు**

**కార్యదర్శి వెంకటరమణారెడ్డికి ఘనంగా సన్మానం**



చిగురుమామిడి (వాయిస్ టుడే): పదవి విరమణ పొందిన ఉద్యోగులు సమాజసేవలో భాగస్వామ్యం కావాలని, ఉద్యోగ విరమణ వృత్తికే కానీ సేవకు కాదని తహసిల్దార్ రమేష్, ఎంపీడీవో ఖాజా మొయినుద్దీన్ లు తెలిపారు. శనివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇనుకొండ వెంకటరమణారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని మండల పరిషత్ లో అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉత్తమ సేవలతోనే ప్రతి ఉద్యోగి సమాజంలో గుర్తింపు ఉంటుందని, ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగికి సాధారణమని తెలిపారు. వెంకటరమణారెడ్డి 43సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తూ గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్లాడని పలువురు వారి సేవలను కొనియాడారు. కొత్తపల్లి, రామంచ, చిన్నముల్కనూర్, ఇందుర్తి, నల్లగొండ, చింతకుంట తదితర గ్రామాల్లో గ్రామ కార్యదర్శిగా పనిచేసి అక్కడి ప్రజలను అన్ని రంగాల్లో చైతన్యవంతులను చేసి, అందరూ మనలను పొందారని గుర్తు చేశారు. పదవి విరమణ పొందిన వెంకటరమణారెడ్డి శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో గడపాలని పలువురు ఆకాంక్షించారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన ప్రజలందరికీ పేరుపేరునా వెంకటరమణారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓలు రాజశేఖర్ రెడ్డి, శ్రావణ్ కుమార్, మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్, అందె స్వామి, నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, చిట్టుమల్ల శ్రీనివాస్, చిట్టుమల్ల రవీందర్, సాంబారి కొమురయ్య, కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదే రఘునాథ్ రెడ్డి, శ్రీమూర్తి రమేష్, గోలి బాబు రెడ్డి, సన్నీళ్ల వెంకటేష్, అందే చిన్నస్వామి, పొన్నం శ్రీనివాస్, చింతపుల నాగయ్య, గూడెం లక్ష్మి, ఏపీఎం మట్టెల సంపత్, గ్రామ పంచాయతీల కార్యదర్శిలు, పలు గ్రామాల ప్రజలు నాయకులు తదితరులు పాల్గొని శాలువాలు కప్పి మేమొంటోలు అందజేసి ఘనంగాసన్మానించారు.

## కొడుకు మృతితో.. 36 గంటల్లోనే తనువు చాలించిన తల్లి



చంద్రుగొండ: కొడుకు మృతిని తట్టుకోలేక ఒక్కరోజు వ్యవధిలో తల్లీ తనువు చాలించిన హృదయ విదారక ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తుంగారం పంచాయతీ వెంగళరావుకాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన గుగులోత్ సాగర్(22) ప్రేమ విఫలమై నెలన్నర క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కొడుకుని బతికించుకునేందుకు తల్లిదండ్రులు గుగులోత్ లక్ష్మణ్, రమణి తీవ్రంగా యత్నించారు. సుమారు రూ.20 లక్షల వరకు వెచ్చించి వైద్యం చేయించినా ఫలితం దక్కలేదు. సాగర్ గురువారం ఉదయం 4 గంటలకు మృతి చెందాడు. సాగర్ ఆత్మహత్యాయత్నం చేసినప్పటి నుంచి తల్లి రమణి కుంగిపోయింది. కొడుకు పరిస్థితి విషమించిందని వైద్యులు నిర్ధారించి ఇంటికి తీసుకెళ్లమని చెప్పినప్పటి నుంచి మరింత మనోవేదనకు గురైంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఆమె కూడా మృతి చెందింది. ఒక్కరోజు వ్యవధిలోనే తల్లీకొడుకుల మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. లక్ష్మణ్, రమణిలకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమార్తెలకు వివాహాలు చేసి పంపారు. ఈ ఘటనతో లక్ష్మణ్ కుటుంబం విలవిల్లాడుతోంది.



## జోరు వర్షం.. రహదారులు జలమయం

**కరీంనగర్‌లో దంచి కొడుతున్న వర్షం**

సుభాష్‌నగర్, జమ్మికుంట: కరీంనగర్ జిల్లాలో పలు ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మేఘాలు కమ్ముకొని ఒక్కసారిగా వాన పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలు, కళాశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన సమయంలో వాన పడటంతో ఆటంకాలు తప్పలేదు. మరో వైపు నగరంలోని రహదారులు చిత్తడిగా మారాయి. బురద రోడ్లు గుంతలు పడటంతో కాలనీవాసులు అవస్థలు పడ్డారు. జమ్మికుంటలో కురిసిన వర్షంతో రహదారులు జలమయం అయ్యాయి. స్థానిక ఆర్వోబీ పక్కన రహదారులు నీటితో నిండిపోవటంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. గాంధీచౌక్, రైల్వేస్టేషన్, వీణవంక రోడ్లు, ఎంప్లాయిస్ కాలనీ తదితర రహదారులపై వరద చేరింది.

## అనిశా వలలో విద్యుత్తు శాఖ డీఈ



స్టేషన్‌ఘన్‌పూర్: వ్యవసాయ భూమిలో నుంచి వెళ్తున్న 33 కేవీ విద్యుత్తు లైన్‌ను మార్చేందుకు రైతు నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటూ జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ విద్యుత్తు శాఖ డీఈ మాలోత్ హుస్సేన్ నాయక్ అనిశాకు పట్టుబడిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. అనిశా డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన కుంభం ఎల్లయ్య అనే రైతుకు గ్రామ శివారులోని మోడల్ కాలనీలో వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమి మధ్యలోంచి 33 కేవీ లైన్ వెళ్తుండటంతో ఇబ్బందిగా మారింది. అదే భూమిలో ఓ పక్కకు మార్చాలని విద్యుత్తు శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు అంచనా వేసి రూ.16 లక్షలు అవుతాయని చెప్పగా.. రైతు డబ్బులను మూడు నెలల క్రితమే చెల్లించారు. సంబంధిత గుత్తేదారు భూమిలోంచి విద్యుత్తు స్తంభాలను పక్కకు వేసి వదిలేశారు. తీగలు అమర్చడానికి రైతు ఎల్లయ్య ఎల్‌సీ ఛార్జి రూ.2 లక్షల మేర చెల్లించారు. అయినా పనులు ముందుకు సాగకపోవడంతో గుత్తేదారును నిలదీశాడు. దీంతో డీఈ పనులను నిలిపివేయించారని ఆయన చెప్పారు. రైతు డీఈ వద్దకు వచ్చి అడగ్గా పని పూర్తికావాలంటే తనకు రూ.20 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో రైతు కుమారుడు కుంభం రాజు వరంగల్‌లోని అనిశా అధికారులను మూడు రోజుల క్రితం ఆశ్రయించాడు. శనివారం రాత్రి డీఈ హుస్సేన్ నాయక్‌కు రాజు రూ.20 వేలు ఇస్తుండగా పక్కా ప్రణాళికతో పట్టుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు సట్ల రాజు, ఎల్ రాజు, శ్యాంసుందర్ సిబ్బంది పాల్గొన్నారు.



## చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

**రూ. 22.56 లక్షల సొత్తు స్వాధీనం**

జనగామ టౌన్: ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను జనగామ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.22.56 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జనగామ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. హనుమకొండ రెవెన్యూ కాలనీకి చెందిన బంగారి నరేశ్‌కుమార్, వరంగల్ ఎనుమాముల మార్కెట్ ప్రాంతం ఎల్‌బీ.నగర్‌కు చెందిన మహమ్మద్ ఆసిఫ్ పాషా కలిసి జనగామ, నర్సంపేట, కేయూసీ, భూపాలపల్లి, తొర్రూరు, సుబేదారి, వర్ధన్నపేట పరిధిలోని ఇళ్లల్లో చోరీలు చేస్తున్నారు. యశ్వంతాపూర్ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తుండగా ఇద్దరు కారులో వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలను అంగీకరించారు. నిందితుల నుంచి 25 తులాల బంగారు ఆభరణాలు, 137 తులాల వెండి ఆభరణాలు, రూ.3.79 లక్షల నగదుతో పాటు స్కోడా కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో జనగామ ఏసీపీ కొండం పార్థసారథి, పట్టణ సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు మోదుగుల భరత్, చెన్నకేశవులు, శ్వేత, సిబ్బంది శంకర్, రామన్న, రామకృష్ణ, అనిల్, సురేష్, సల్మాన్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



## పబ్బుల్లో డ్రగ్స్ పరీక్షలు.. డీజే సహా ఆరుగురికి పాజిటివ్

హైదరాబాద్: ఆబ్కారీ శాఖ, టీజీ న్యాబ్ సంయుక్త ఆపరేషన్‌లో డ్రగ్స్ తీసుకున్న ఆరుగురు పట్టుబడ్డారు. 25 బృందాలు 107 డ్రగ్స్ కిట్లతో శుక్రవారం రాత్రి 11- 1 గంటల మధ్య ఏకకాలంలో 25 పబ్బుల్లో పరీక్షలు నిర్వహించారు. బండ్లగూడ జాగీర్‌కు చెందిన డీజే అభిషేక్ శ్రీవాత్సవ(35) దొరికాడు. విస్కీసాంబ పబ్బులో డీజేగా పనిచేస్తున్నాడు. మాసబ్‌ట్యాంక్‌కు చెందిన విద్యార్థి అబ్దుల్ ఘనీ(22), ఐటీ కన్సల్టెంట్ శాశ్వత్ మహాపాత్ర(31), ఉత్తరాఖండ్‌కు చెందిన స్నేహ కక్కర్(28), కిషన్‌బాగ్‌కు చెందిన మీర్ అబిద్ అలీ(30), విజయవాడ మాచవరం చెందిన యువతి దొరికారు. మాదాపూర్‌లోని విస్కీసాంబ పబ్బులో ఇద్దరు, నార్సింగిలో రెవల్యూషన్ క్రాఫ్ట్ బ్రూవ్‌లో ఇద్దరు, జూబ్లీహిల్స్‌లోని క్లబ్‌రోగ్‌లో యువతి, జూబ్లీహిల్స్‌లో జోరా పబ్బులో ఒకరికి పాజిటివ్‌గా తేలింది.

## ఔషధాల మిశ్రమంతో మత్తు

**ఇద్దరు యువకులు, ముగ్గురు యువతుల అరెస్టు**

జూబ్లీహిల్స్: వైద్యుడి చీటీ లేకుండా మాత్రలు కొనుగోలు చేసి వాటిని పొడిగా మార్చి మత్తు పదార్థంగా వినియోగిసుతన్న మిజోరం రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు, ముగ్గురు యువతులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలువురు యువతీయువకులు బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో ఎలాంటి వైద్యుడి చీటీ లేకుండా మాత్రలు కొనుగోలు చేస్తున్నట్లు బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు రోడ్ నంబరు 12లోని శ్రీరాంనగర్‌లో వారు నివసించే ఇంటికి వెళ్లి తలుపు తట్టారు. గదిలో మిజోరం రాష్ట్రానికి చెందిన అబ్రహం లాల్మన్‌పుయ అలియాస్ ఒప్పొ, లల్‌రుయాకిమి, లాల్‌రిండికి, రికి జామ్వాన్‌సంగ్వా, కాథరిన్ లాల్మన్‌పుయా మత్తులో జోగుతూ కనిపించారు. వీరిని విచారించగా కొన్నాళ్లుగా మత్తుకు అలవాటుపడి మూడు రకాల మాత్రలను చూర్ణం చేసి సెలైన్ నీటితో కలిపి ఇంజెక్షన్ చేసుకుంటున్నట్లు గుర్తించారు. కవాడిగూడలో నివసించే సంజీవ ఈ మాత్రలను ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇస్తున్నట్లు విచారణలో వెల్లడించారు. వీరి నుంచి 52 గ్రాముల చూర్ణంతోపాటు 40 సిరంజిలు, మాత్రలు, చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. సంజీవతో పాటు సహకరించిన లాల్నుంపుయా, డేవిడ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులపై మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు.



## హైడ్రా పై తెలంగాణ సీఎంకి లేఖ

**జమ్మికుంట పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్**

జమ్మికుంట ఆగస్టు 31 (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రా వ్యవస్థ,దాని పనితీరు మీద ప్రజల నుండి వస్తున్న స్పందన చూసి హుజూరాబాద్ నియోజకవర్గం జమ్మికుంట పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సీఎం రేవంత్ రెడ్డి కి లేఖ రాసారు. హైడ్రా పై ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని, చెరువులు,కుంటలు కాపాడుకోవడానికి హైడ్రా తరహా వ్యవస్థను ప్రతీ జిల్లాలో కూడ ఏర్పాటు చేయాలని ప్రజల నుండి వస్తున్న డిమాండ్ ను లేఖ ద్వారా పూదరి రేణుక శివకుమార్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు భరోసా

**హుజూరాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వొడితల ప్రణవ్**

**రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి సంతాపం**

**గాయపడ్డ వారికి మెరుగైన వైద్య అందించాలి**



హుజూరాబాద్ ఆగస్టు 31 (వాయిస్ టుడే): హుజురాబాద్ మండలం సింగపూర్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని హుజరాబాద్ ఆసుపత్రి వైద్యులకు సూచించారు. హుజురాబాద్ మండలం కాట్రపల్లి గ్రామం నుండి కొత్తగట్టు గ్రామంలో గల మత్స్య గిరింద్ర స్వామి దేవాలయానికి ఉదయం నాలుగున్నర గంటల సమయంలో వెళ్తుండగా సింగపూర్ గ్రామం వద్ద ఆటోను లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఆరుగురికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సంఘటనలను తెలుసుకున్న ప్రణవ్ మృతిచెందిన తాడూరి రాజమౌళి కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేయడంతో పాటు గాయపడిన బాధితులకు అత్యవసరమైన చికిత్స అందించాలని కోరారు. వివాహానికి వెళ్తున్న సమయంలో ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు.



## డాక్టరేట్ పొందిన డా. స్వర్ణరేఖకు అభినందనలు

గోదావరిఖని, ఆగస్టు 31 : గోదావరిఖని కి చెందిన డా. స్వర్ణరేఖ ఇటీవల ఉస్మానియా యూనివర్శిటీ ద్వారా డాక్టరేట్ పొందిన సందర్భంగా న్యూ ఇండియా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డా. జే వి రాజు, నాయకులు జనగామ తిరుపతి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ విభాగంలో సోలార్ ఎనర్జీ సబ్జెక్టు లో పరిశోధనపత్రాన్ని ఉస్మానియా యూనివర్శిటీ కమిటి ముందు కాన్ఫిడెన్స్ తో పరిశోధన సారాంశాన్ని ఓరాల్ గా గ్రంథరూపం లో రాతపూర్వకంగా సమర్పించి డాక్టరేట్ పొందడం జరిగింది అని అన్నారు . స్వర్ణరేఖ ఎన్నో అడ్డంకులు అధిగమించి డిగ్రీ, పిజి, మరియు పి హెచ్ డి పూర్తిచేసి శాస్త్రవేత్తగా నిలవడం ఎంతో అభినందనీయం అని కొనియాడారు. విద్యార్థులు చిన్న అడ్డంకి ఎదురైతేనే మధ్యలోనే చదువును ఆపుతున్న వారు ఎందరో ఉన్నారు అని కానీ డా.స్వర్ణరేఖ మాత్రం అడ్డంకులు అన్ని అధిగమించి ముందుకు సాగారు అని ప్రశంసించారు. ఇటీవల ఆక్సిడెంట్ లో తండ్రిని కోల్పోయినా భర్త జయ్ కుమార్ సహకారం తో పరిశోధన కొనసాగించడం తన దీరత్వానికి దృఢ సంకల్పానికి నిదర్శనం అదేకాకుండా అటు పుట్టింటి గౌరవం కాపాడుతూ, మెట్టింటి బాధ్యతలు చక్కగా నిర్వహిస్తూ భార్యగా, తల్లిగా గృహిణిగా తన కర్తవ్యాలను కొనసాగిస్తూ ఫిలాఫసర్ గా, డాక్టరుగా, శాస్త్రవేత్తగా ఉస్మానియా యూనివర్శిటీ నుండి పి హెచ్ డి పొందడం తమకెంతో గర్వకారణం అని అన్నారు. డా . స్వర్ణరేఖ ముందు ముందు మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించి సమాజానికి , దేశానికి తనవంతు సేవ చేయాలి అని ఆదర్శవంతమైన భవిష్యత్తు ప్రయాణం కొనసాగాలి అని జే వి రాజు , జనగామ తిరుపతి ఆకాంక్షించారు.

## మణుగూరు జలదిగ్బంధం.. ఇళ్లోలోకి విష సర్పాలు

**భయకంపితులవుతున్న పట్టణ ప్రజలు**



మణుగూరు: మణుగూరు పట్టణం పూర్తిగా జలమయం అయింది. శనివారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షానికి పట్టణ పరిధిలోని కుందరాయి నగర్, ఆదర్శనగర్, కాళీమాత ఏరియా, పైలట్ కాలనీ, వినాయక్‌నగర్, అశోక్‌నగర్, పలు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు స్థానికులు వాపోయారు. పలు ప్రాంతాల్లో వరద నీటితో విష సర్పాలు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మణుగూరు ప్రధాన రహదారిపై అరకిలోమీటరు మేర వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ రాఘవరెడ్డి, ఇతర అధికారులు ముంపు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచించారు.